BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం , 06 ఆగస్టు-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

# బలగం TV BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

## డయల్ 112 సేవలు ప్రారంభం




వివరాలు 4లో..

## డిసెంబర్‌లో 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్



- సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు చేయాలి
- సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి
- భారీ పెట్టుబడుల ఆకర్షణకు గ్లోబల్ సమ్మిట్ వేదికగా నిలవాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్,ఆగస్ట్5 : డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారం అత్యంత అవసరమని అన్నారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధికి గ్లోబల్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని మిగతా 3లో..

## 22ఏ భూముల పేరిట ఏ ఒక్క అర్హుడికీ అన్యాయం జరగదు

- కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు
- ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలి
- అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి
- 22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి
- జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టమైన ఆదేశాలు



హైదరాబాద్, ఆగస్టు 05: రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కు దారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమ యంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత మిగతా 3లో..

## తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

- గోదావరి రివర్ బోర్డ్ అజెండాలో ఎపికి అనుకూల నిర్ణయాలు
- 18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్



హైదరాబాద్, ఆగస్టు 05: ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలం గాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మె ంట్ బోర్డు అజెం డా రూపొం దుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపిం చారు. ఒక ఉద్యమ కారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులు తోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్‌ఎంబీ ఎజెండాలో పెట్టాడు.కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించారు. దీన్ని మిగతా 3లో..

## 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు

- నిరసనకారుల ఇళ్లపైకి గూండాలను పంపారు
- రాహుల్ ఆరోపణలు



న్యూఢిల్లీ, ఆగస్టు 05 : నీట్ పేపర్ లీక్ వివాదంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద యువత నిరసనలు తెలిపారు. అయితే, విద్యార్థుల్ని బలప్రయోగం, బెదిరింపులతో కేంద్రం అణచివేసిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులతో కలిసి ఆయన బుధవారం మీడియాతో మాట్లాడా రు. విద్యార్థుల ఇళ్లకు గుండాలను పంపించారని, 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించారని రాహు ల్ గాంధీ ఆరోపించారు. నిరసనకారులు రాజ్యాంగ పరిరక్ష కులని, కూప్పకూలుతున్న పనికిరాని విద్యా వ్యవస్థను ప్రశ్నిచడంలో ఎలాంటి తప్పు లేదని అన్నారు. నిరసనల్లో పాల్గొన్న వారి ఇళ్లకు గుండాలను పంపించారని, ఆ తర్వా త 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించి, ఆ క్షమాపణలు అంగీకరించారని, ఇది పూర్తిగా అర్థర హితం, దీనిని తాము అంగీకరించమని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని, వారిని వేధించారని ఆరోపించారు. దేశంలో పారదర్శకంగా పనిచేసే విద్యా వ్యవస్థ అవసరమని అన్నారు. విద్యార్థులు ఎలాంటి హింసకు పాల్పడలేదని, వారిపై లాఠీచార్జ్ చేయడం, వేధించడం సరికాదని అన్నారు. తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులపై గర్వంగా ఉందని పేర్కొన్నారు.

## తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..

- తెలంగాణ-మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయండి
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి
- పీఎంకు రాసిన లేఖ... పీఎంవో స్పందనపై చర్చ..
- చర్చల పక్రియ ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి పాటిల్ హామీ



న్యూఢిల్లీ, ఆగస్టు 05 : ప్రాణహితనదిపై తుమ్మిడిహెట్టిబ్యారేజీ నిర్మాణం ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమ తులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావంపెద్దగా ఉండదని వివరించారు. జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ఆయన కార్యాలయంలోముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి తాను రాసిన లేఖ, దానికి ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్శక్తికి పంపిన లేఖ విషయాన్నిముఖ్యమంత్రి జల్‌శక్తి మంత్రితో ప్రస్తావించారు. మిగతా 3లో..

## నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ

- 8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం

హైదరాబాద్,ఆగస్ట్5 : హైడ్రా కమిష నర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాదాపు ఎనిమిది ప్రైవేటు కాలేజీలు.. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేశాయి. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తూ నకిలీ ఫ్లై÷ర్ ఎన్‌వోసీలను సృష్టించిన కళాశాలలు.. వాటిని ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ విషయం గుర్తించిన అధికారులు దీనిపై విచారణ చేపట్టగా.. హైడ్రా కమిషనర్ రంగ నాథ్ సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారి ంచారు. దీంతో నకిలీ పత్రాలు సమర్పి ంచిన ఎనిమిది ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని సంబం ధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ ఘటనపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ నో అ÷జబెక్షన్ సర్టిఫికెట్లు సృష్టించి ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించిన అధికారులు 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలపై కేసు నమోదు చేశారు.ఈ పత్రాల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయడంతో లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో తెల్లాపూర్, మిగతా 3లో..

## యాద్గిర్ జిల్లా రసాయన పరిశ్రమలో ప్రమాదం

- ముగ్గురు యువకుల దుర్మరణం
- ఒకరు నారాయణపేట జిల్లా వ్యక్తిగా గుర్తింపు

రాయచూర్,ఆగస్ట్5 : కర్ణాటక యాద్గిర్ జిల్లాలోని ఓ రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తెలంగాణ యువకుడు సహ ముగ్గురు యువకులు మరణించారు. మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. విషవాయువులు విడుదల కావ డంతో బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి 2 గంటల మధ్యలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలోని విషవాయువులు లీకవ్వడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. విషవాయువులు లీకవ్వడంతో ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఐదుగురు కార్మికులు ఒక్కసారిగా అస్వస్థతకు గురవ్వడంతో వారిని రాయచూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడి కల్ సైన్సెస్ (రిమ్స్)కు తరలించారు. అయితే అప్పటికే ము గ్గురు మృతిచెందినట్లుగా వైద్యులు గుర్తించారు. మృతులను తెలంగాణలోని నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ఆలంపల్లికి చెందిన గణేశ్, మధ్యప్రదేశ్‌లోని కట్నీ జిల్లాకు చెందిన విక్రమ్, సంజయ్‌లుగా గుర్తించారు.

## సిఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన



### షరతులతో అనుమతిచ్చిన ఎసిబి కోర్టు

హైదరాబాద్,ఆగస్ట్5 : సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం, ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించేందుకు అనుమతించింది. ఇందుకోసం కోర్టు కస్టడీలో ఉన్న ఆయన పాస్‌పోర్టులను తాత్కాలికంగా విడుదల చేయాలని ఆదేశించింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో విదేశీ పర్యటన చేపడుతున్నట్లు రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పాస్‌పోర్టులను తాత్కాలిక కస్టడీకి ఇవ్వడంతో పాటు విదేశీ ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించింది. విదేశీ పర్యటనకు అనుమతి ఇస్తూనే కోర్టు పలు షరతులు విధించింది. లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒక ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రయాణ వివరాలు, అక్కడ బస చేసే చిరునామాలు, సంప్రదింపు ఫోన్ నంబర్లు కోర్టుకు అందజేయాలని పేర్కొంది. అలాగే, సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్టులను తిరిగి కోర్టులో జమ చేస్తానని అఫిడవిట్ దాఖలు చేయాలని రేవంత్ రెడ్డిని ఆదేశించింది. ఆ అఫిడవిట్ సమర్పించిన అనంతరం ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారికి లేఖ రాసి పాస్‌పోర్టులను తాత్కాలికంగా అప్పగించాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది.

## జార్ఖండ్ నిరుద్యోగులకు సిజెపి మద్దతు

- దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తాం
- రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు
- సిజెపి నేత అభిజిత్ దీప్కే స్పష్టీకరణ

మిగతా 4లో..

## విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- బడ్జెట్ కేటాయింపులే నిదర్శనం
- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశిపతి శ్రీనివాస్



హైదరాబాద్,ఆగస్ట్5 : తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యంత తక్కువ నిధులు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. 2024-25 బడ్జెట్‌లో మొత్తం వ్యయంలో విద్యారంగానికి కేవలం 5.98 శాతం మాత్రమే కేటాయించడం ప్రభుత్వ బాధ్య తారాహిత్యానికి నిదర్శనమని ఆయన దుయ్య బట్టారు. గత 6-7 ఏళ్ల తెలంగాణ బడ్జెట్‌లను పరిశీలిస్తే విద్యారంగానికి ఇంత తక్కువ శాతం నిధులు కేటాయించడం ఇదే తొలిసారని దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజ్ఞాన గనిగా మారాల్సిన తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టాలని చూస్తోందని ఆరోపించారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దే ఉంచుకున్న ప్పటికీ, ఆ శాఖకు తగిన నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

## ఇంటర్ కాలేజీలకు ఎన్‌వోసి తప్పనిసరి

- ఎన్‌వోసిలను పరిశీలించగా నకిలీవని తేలింది
- వీటిపై విచారణ కొనసాగుతుందన్న బోర్డు సెక్రటరీ

హైదరాబాద్,ఆగస్ట్5 : ఇంటర్మీడియట్ కాలేజీ లకు ఎన్‌వోసి కంపల్సరీ చేశామని ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలి పారు. ఇంటర్మీడియట్ బోర్డుకు వచ్చిన కొన్ని ఎన్‌వోసిలను హైడ్రాతో సం ప్రదించి పరిశీలించగా, కొన్ని సర్టిఫికెట్లు బోగస్‌గా ఉన్నట్లు గుర్తించామ న్నారు. హైడ్రాకు వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇంటర్మీడియట్ బోర్డుకు అందడంతో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చిందని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఫేక్ ఎన్‌వోసిల వ్యవహారంపై విచారణ కొనసాగుతో ందని, విచారణ పూర్త యిన తర్వాత ఎన్ని నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారనే విషయం స్పష్టమవుతుందని తెలిపారు. నకిలీ ఎన్‌వోసిల విష యంలో హైడ్రా, ఇంటర్మీడియట్ బోర్డు సీరియస్‌గా ఉన్నాయని అభి లాష అభినవ్ వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఇంటర్మీడియట్ బోర్డు స్థాయిలోఅంతర్గత విచారణ కూడాచేపడు తున్నట్లు తెలిపారు. నిబం ధనలు ఉల్లంఘించిన కాలేజీలపై తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఫేక్ ఎన్‌వోసిల వ్యవహారంపై విద్యార్థులు, తల్లి దండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులకు ఎలాంటినష్టంకలగకుండా అవసరమైన అన్ని చర్య లు తీసుకుంటామని అభిలాష అభినవ్ తెలిపారు. కాలేజీల అనుమతు లకుసంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబా టులో ఉన్నాయని, తల్లిదండ్రులు ఏవైనా సందేహాలు ఉంటే వెబ్‌సైట్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చని సూచించారు. ఈ విద్యా సంవత్స రానికి సంబంధించి 3 వేలకుపైగా ఇంటర్మీడియట్ కాలేజీలు అనుమ తులు పొందినట్లు ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు.

# కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు

- 10న జైల్ భరో కార్యాక్రమానికి పిలుపు




భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్5 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశంఖం పూరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా రమేశ్ పిలుపు నిచ్చారు. జూలూరుపాడు మండల కేంద్రంలోని సిపి ఎం పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సిఐటి యు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మండల సదస్సు జరిగింది. ఈ సద స్సుకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాసా నరేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లా డుతూ నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్ట బెడుతోందని తీవ్రంగా విమర్శించారు. ప్రజల ఓట్లతో గెలిచి ప్రజా సంపదను దోచుకుంటూ, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందన్నారు. వెంటనే పత్తి, మొక్కజొన్న, పాడి ఉత్పత్తులు దిగుమతి ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం కొత్తగా తెచ్చిన విబి జి రామ్ జీ విధానాలను, నూతన విత్తన చట్టం, విద్యుత్ సవరణ చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త 'జైల్ భరో' ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, నిరసనకారులతో పోలీస్ స్టేషన్లు, జైళ్లు నిండాలని కోరారు. ఈ సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పద్దం సుగుణ, రాచబంటి కోటేశ్వరరావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, సిఐటియు మండల కన్వీనర్ బోడ అభిమిత్ర, రైతు సంఘం మండల నాయకులు మాలోత్ రాములు, బానోత్ ఈశ్వర్, ధరావత్ రమేష్, గార్లపాటి వెంకటి, ఇల్లంగి సీతారాములు, బానోత్ రూపా పాల్గొన్నారు.

# ఫామ్ పాండ్ల నిర్మాణంతో రైతులకు మేలు



- పలు గ్రామాల్లో నిర్మాణాలు పరిశీలించిన కలెక్టర్

కామారెడ్డి,ఆగస్ట్5 : గాంధారి మండలంలోని పోతంగల్ కుర్దు, సీతాయిపల్లి గ్రామపంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో అమలు చేస్తున్న ఫామ్ పాండ్ల నిర్మాణాన్ని అన్ని గ్రామపంచాయతీల్లో విస్తృతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో భాగంగా పోతంగల్ కుర్దు గ్రామపంచాయతీలో నిర్మించిన ఫామ్ పాండ్, కొబ్బరి బండ్ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫామ్ పాండ్‌ను వినియోగిస్తున్న రైతుతో మాట్లాడి పథకం వల్ల కలుగుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఫామ్ పాండ్‌లో చేపల పెంపకం ద్వారా ప్రతి సంవత్సరం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు అదనపు ఆదాయం లభిస్తుందని రైతు కలెక్టర్‌కు తెలిపారు. అలాగే ఫామ్ పాండ్‌లో నిల్వ చేసిన నీటిని సాగునీటిగా వినియోగించడం వల్ల యూరియా వినియోగం గణనీయంగా తగ్గడంతో పాటు పంట దిగుబడి కూడా మెరుగుపడిందని వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, రైతుల ఆదాయ వృద్ధి లక్ష్యంగా పథకం కింద అర్హులైన రైతులను గుర్తించాలని అన్నారు. గాంధారి మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పెద్ద ఎత్తున ఫామ్ పాండ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేసి రైతులకు త్వరితగతిన ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీతాయిపల్లి గ్రామపంచాయతీ లో కొనసాగుతున్న భూభారతి రీ-సర్వే పనులను పరిశీలించారు. ప్రస్తుతం బౌండరీ ఫిక్సింగ్ పనులు కొనసాగుతుండగా, ఇప్పటివరకు 11.5 కిలోమీటర్ల బౌండరీ ఫిక్సింగ్ పూర్తయిందని అధికారులు వివరించారు. ఈ పనులను నాణ్యతా ప్రమాణాలతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించి మహిళలు కుడుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్‌లను పరిశీలించారు. యూనిఫామ్‌ల నాణ్యత, కుట్టు పనితీరును పరిశీలించి, నిర్ణీత సమయంలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్‌తో ఆర్డీవో మస్తా ప్రభాకర్, సర్పంచ్ సంతోష్, అంజాద్, తహసీల్దార్ రేణుక చౌహాన్, ఎంపీడీవో రాజేశ్వర్, ఏడీ సర్వేయర్ శ్రీనివాస్, ఏపీఎం లక్ష్మీ ప్రసన్న, ఏపీవో మధు, టెక్నికల్ అసిస్టెంట్ నరేష్, అధికారులు ఉన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

## కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి,ఆగస్ట్5 : సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి అని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షా తిరంగా సైబర్ స్వతంత్ర తెలంగాణ' రాష్ట్రవ్యాప్త సైబర్ అవగాహన కార్యక్రమాన్ని భిక్కనూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుతం స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్, ఫేక్ లింకులు, ఓటీపీ, కేవైసీ అప్‌డేట్, డిజిటల్ అరెస్ట్, నకిలీ కస్టమర్ కేర్ కాల్స్ వంటి సైబర్ మోసాలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కృత్రిమ మేధస్సు దుర్వినియోగంతో డీప్‌ఫేక్ వీడియోలు, నకిలీ వాయిస్ కాల్స్, తప్పుడు సందేశాలు, నకిలీ సోషల్ మీడియా ఖాతాల ద్వారా మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు, యువత, సోషల్ మీడియా వినియోగదారులు అపరిచితుల నుంచి వచ్చే లింకులు, ఉద్యోగాలు, పెట్టుబడి ప్రకటనలను ధృవీకరించకుండా నమ్మవద్దని, వ్యక్తిగత సమాచారం, ఓటీపీ, ఏటీఎం పిన్, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్లు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. ఆగస్టు నెలంతా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, మహిళా సంఘాలు తదితర ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ, భిక్కనూరు సీఐ, ఎస్ఐలు, సైబర్ క్రైమ్ అధికారులు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్5 : గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన కొమరం రాంగోపాల్(24) ఇదే గ్రామానికి చెందిన మరో యువకుడు పూనెం సందీప్ ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై మంగళవారం అర్ధరాత్రి మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్దకు వచ్చి క్యానులో డీజిల్ నింపుకుని తిరిగి వెళ్తున్నారు. మార్గం మధ్యలో బైక్ వెనుక కూర్చున్న రాంగోపాల్ క్యాన్ జారిపోవడంతో కిందకి దిగాడు. అదే సమయంలో వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం వెనుక నుండి బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. వెంటనే సందీప్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి క్షతగాత్రుడిని తరలించారు. బుధవారం ఉదయం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో రాంగోపాల్ యువకుడు మృతి చెందాడు. అందరితో కలివిడిగా ఉండే యువకుడి అకాల మరణంతో గ్రామంలో విషాధ ఛాయలు అలుముకున్నాయి. రాంగోపాల్ అన్నయ్య కొమరం సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పీవీ నాగేశ్వరరావు తెలిపారు. కాగా గుర్తు తెలియని వాహనాన్ని వెంటనే గుర్తించి వారిపై చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. చేతికి అందిన కుమారుడు తమకు చేదోడువాదోడుగా ఉండే సమయంలో ప్రమాదంలో అకాల మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# జగన్‌పై అవినీతి కేసులపై రాజ్యసభలో టిడిపి ప్రస్తావన

- 13 ఏళ్లవుతున్నా తేలడం లేదంటూ ఎంపి విజయ్ వెల్లడి
- సుప్రీం జడ్జిల బిల్లుపై చర్చలో ప్రస్తావనను ఆక్షేపించిన డిప్యూటి ఛైర్మన్



న్యూఢిల్లీ,ఆగస్ట్5 : పార్లమెంట్, రాజ్యసభలో ప్రతిపాదించిన 'సుప్రీంకోర్టు న్యాయమూర్తుల (సవరణ) బిల్లు - 2026'పై మాట్లాడే క్రమంలో జగన్ కేసుల విషయాన్ని తెలుగుదేశం పార్టీ ఎంపీ చింతకాయల విజయ్ ప్రస్తావించారు. దాదాపు కొన్నేళ్లుగా కేసుల విషయంలో జరుగుతున్న జాప్యాన్ని ప్రస్తావించారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కు పెంచడం సకాలంలో తీసుకున్న అభినందనీయమైన నిర్ణయమని పేర్కొన్నారు. సత్వర న్యాయం అందించే దిశగా ఈ-కోర్టులు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీని, అమరావతిలో జ్యుడీషియల్ మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు విజన్‌ను ఎంపీ విజయ్ సభలో ప్రముఖంగా ప్రశంసించారు. చట్టం ముందు సామాన్యులైనా, అత్యంత బలవంతులైనా సమానులేనని, న్యాయం ఆలస్యం అవడమంటే న్యాయం నిరాకరించినట్లేనని ఎంపీ విజయ్ స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులను ఆయన రాజ్యసభ సాక్షిగా ప్రస్తావించారు. జగన్‌పై 2013లో నమోదైన సీబీఐ, ఈడీ కేసులు 13 ఏళ్లు గడుస్తున్నా విచారణ ముందుకు సాగలేదని ప్రశ్నించారు. డిశ్చార్జ్ పిటిషన్లు, న్యాయమూర్తుల బదిలీల సాకుతో ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సకాలంలో విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సుదీర్ఘ జాప్యాల వల్ల న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందని ఎంపీ విజయ్ కుండబద్దలు కొట్టారు. అయితే డిప్యూటి ఛైర్మన్ ఈ వ్యాఖ్యల ప్రస్తావనను ఆక్షేపించారు. బిల్లుపై మాత్రమే మాట్లాడాలని అన్నారు. భారత జనాభా 150 కోట్లకు చేరుకున్న ప్రస్తుత తరుణంలో, సామాన్యులకు సైతం వేగంగా, పారదర్శకంగా న్యాయం అందాలన్నదే తమ ఆకాంక్ష అని ఎంపీ విజయ్ తెలిపారు. ఈ వ్యవస్థపై ప్రజలకు పూర్తి భరోసా కలగాలంటే కేవలం అత్యున్నత న్యాయస్థానంతో పాటు హైకోర్టులు, కిందిస్థాయి కోర్టులు, ముఖ్యంగా ప్రత్యేక సీబీఐ కోర్టులను సైతం ఏకకాలంలో బలోపేతం చేసి తీర్పులు వేగవంతం చేయాలని ఎంపీ చింతకాయల విజయ్ డిమాండ్ చేశారు.

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం

- గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే



జగిత్యాల,ఆగస్ట్5 : చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందని విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అన్నారు. జగిత్యాల జిల్లా కోరుట్లలోని ప్రభుత్వ బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలతో పాటూ మండ లంలోని మాదాపూర్, మోహన్ రావు పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఎమ్మెల్యే బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశా రు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాసంస్థల్లో తరగతి గదులు, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బోధన విధానంపై ఆరా తీశారు. మాదాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలతో కలిసి ఎమ్మెల్యే మధ్యాహ్న భోజనం చేశారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులే దేశ భవిష్యత్ నిర్ణేతలని కష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉన్న ఊరికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చదువుపై ధ్యాస ఉంచాలని పిలుపునిచ్చారు. ఉన్నత లక్ష్యాన్ని ఏర్పర్చుకొని మంచి సాధనతో చదువుల్లో రాణించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కష్టాన్ని వమ్ము చేయకుండా క్రమశిక్షణతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని చెప్పారు. ఏ సమస్య ఉన్న నిర్భయంగా ఉపాధ్యాయుల దృష్టికి తీసుకు వెళ్లాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన, నాణ్యతో కూడిన భోజనం, మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల బరోసా కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, బీఆర్ఎస్ నాయకులు పొట్ట సురేందర్, జాల వినోద్ కుమార్, సజ్జు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు దిగివచ్చిన మెటా



- ప్రధాని మోడీకి జుకర్ బర్గ్ క్షమాపణలు
- కంటెంట్‌ల బూస్ట్‌కు డబ్బులు తీసుకున్నట్లు అంగీకారం

న్యూఢిల్లీ,ఆగస్ట్5 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియో తొలగింపుపై మెటా దిగొచ్చింది. ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్.. ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణలు చెప్పారు. సీఎస్ఏఎమ్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేసిన మెటా.. కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేయడానికి భారీగా డబ్బులు తీసుకున్నట్టు అంగీకరించింది. అంతే కాకుండా తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా అంగీకరించింది. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీకి క్షమాపణలు చెప్పింది. ప్రధాని నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్టు తాత్కాలికంగా తొలగించిన వ్యవహారం మెటాకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సమన్లు జారీ చేయడంతో మెటా గ్లోబల్ బృందం బుధవారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైంది. దాదాపు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మెటా గ్లోబల్ వ్యవహారాల అధికారి జోయెల్ కాప్లన్ నేతృత్వంలోని బృందం ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. అలాగే కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కూడా మెటా బృందం కలిసింది. జూలై 23న ప్రధాని నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన వీడియోను ఫేస్‌బుక్ కొంతసేపు పరిమితం చేసింది. అనంతరం అది సాంకేతిక లోపం వల్ల జరిగిందని మెటా వివరణ ఇచ్చి పోస్టును పునరుద్ధరించింది. అయితే ఈ వివరణను కేంద్ర ప్రభుత్వం సరిపోదని స్పష్టం చేసింది. సమావేశంలో ప్రధాని పోస్ట వ్యవహారంతో పాటు ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్, ప్రకటనలు, కృత్రిమ మేధతో రూపొందించిన తప్పుడు సమాచార నియంత్రణ వంటి అంశాలపై కూడా కేంద్రం ప్రశ్నలు సంధించింది. ప్రముఖ వ్యక్తుల ధృవీకరించిన ఖాతాల్లోని పోస్టులను తొలగించే ముందు మరింత భద్రతా వ్యవస్థ ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. మెటా అల్గోరిథమ్ ఎలా పనిచేస్తోంది? పోస్టులు ఏ ప్రాతిపదికన తొలగించబడుతున్నాయి? భారత చట్టాలకు అనుగుణంగా వ్యవస్థ ఎలా పనిచేస్తుంది? వంటి అంశాలపై కూడా ప్రభుత్వం వివరణ కోరింది. దేశ భద్రత, ప్రజా శాంతి వంటి అంశాలకు సంబంధించిన విషయాల్లో సోషల్ మీడియా వేదికలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ వీడియో తొలగింపును తీవ్రంగా పరిగణించిన పార్లమెంటరీ స్థాయి సంఘం మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. నిర్దేశిత గడువులో స్పందించకపోతే భారతదేశంలో మెటాకు లభిస్తున్న 'సేఫ్ హార్బర్' రక్షణను పునఃపరిశీలించే అవకాశం ఉందని హెచ్చరిం చింది. సోషల్ మీడియా సంస్థలు భారత చట్టాల ను పూర్తిగా పాటించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా మెటా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించినట్లు సమాచారం.

# కొరియర్ బాయ్‌గా వచ్చి మహిళ మెల్లో గొలుసు చోరీ

## సిసి ఫుటేజి ఆధారంగా దొంగను పట్టుకున్న పోలీసులు

హైదరాబాద్, ఆగస్టు 05: మియాపూర్ పరిధిలో కొరియర్ బాయ్‌గా నటిస్తూ ఇంట్లోకి ప్రవేశించిన ఓ యువకుడు మహిళపై పెప్పర్ స్ప్రే చల్లి బంగారు మంగళసూత్రాన్ని అపహరించిన ఘటన కలకలం రేపింది. సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాధితురాలు ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో కొరియర్ డెలివరీ పేరుతో వచ్చిన నిందితుడు.. మహిళ ముఖంపై పెప్పర్ స్ప్రే చల్లి ఆమె మెడలో ఉన్న సుమారు నాలుగు తులాల బంగారు మంగళసూత్రాన్ని లాక్కుని అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలి భర్త మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన మియాపూర్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, బంగారు మంగళసూత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో నిందితుడు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన షేక్ ఖాజా అర్షద్ (20)గా గుర్తించారు. నిందితుడిపై గతంలో ఏపీలోని కనిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు క్రిమినల్ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

# క్యుములోనింబస్ మేఘాల ప్రభావం

## భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ

హైదరాబాద్,ఆగస్ట్5 : క్యుమిలోనింబస్ మేఘాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశ మున్నదని వెల్లడించింది. హైదరాబాద్ సహ 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా కామారెడ్డి, మేడ్చల్-మలాజిగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నల్లగొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ అయ్యింది. ఈ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురువొచ్చు. కాగా, గడిచిన 24 గంటల్లో 4 మండలాల్లో 11.56 సెం.మీ నుంచి 20.44 సెం.మీ మధ్య వర్షపాతం నమోదైంది. 6.45 సెం.మీ నుంచి 11.55 సెం.మీ మధ్య 40 మండలాల్లో, 1.56 సెం.మీ నుంచి 6.44 సెం.మీ మధ్య 281 మండలాల్లో వర్షపాతం నమోదైనట్టు వాతావరణ కేంద్రం తెలిపింది. అత్యధికంగా కామారెడ్డి జిల్లా పిట్లంలో 14.11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు పేర్కొంది.

# రాహుల్ గురించి మాట్లాడే అర్హత లేదు

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై సంపత్ విమర్శలు

హైదరాబాద్,ఆగస్ట్5 : బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై ఏఐసీసీ సెక్రెటరీ సంపత్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ డస్ట్ బిన్‌లో ఆర్ ఎస్ ప్రవీణ్ టిష్యూ పేపర్ అంటూ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత ప్రవీణ్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. కేసీఆర్ కాళ్లు మొక్కి ఒకే పోస్టులో ఏడు సంవత్సరాలు ఉన్నారని ఆరోపిం చారు. ప్రవీణ్‌కుమార్ జాతి ద్రోహి అని.. బీఎస్పీ పార్టీని కేసీఆర్ కాళ్ల దగ్గర పెట్టారని విమర్శించారు. ఐపీఎస్‌గా చేసిన వారు కూడా ఇలా ప్రవర్తించడం దారుణమని సంపత్‌అన్నారు. కల్వకుంట్ల కుటుంబ మాయమాటల మత్తులోప్రవీణ్ ఉన్నారని... ఆ కుటుం బానికి ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. లీగల్ నోటీసు లు ఎప్పు డు పంపుతారో హరీశ్ రావుకు తెలియదా?.. అడ్వకేట్ ఉన్నారు కదా అని నోటీసులు పంపిస్తే ఎలా అని ప్రశ్నించారు. క్షుద్ర పూజల ఆరో పణలపై హరీశ్ సమాధానం చెప్పాలని.. సమాధానం చెప్పకు ండా నోటీసులు పంపడం విడ్డూరమని సంపత్ కుమార్ వ్యాఖ్యానించారు.

# కుటుంబ కలహాలతో తండ్రి రాక్షసత్వం

## నాలుగేళ్ల కుమారుడుని బండకేసి కొట్టిన దుర్మార్గుడు

హైదరాబాద్,ఆగస్ట్5 : నగరంలోని గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో కన్న తండ్రి.. నాలుగేళ్ల కుమారుడిపై దారుణంగా దాడి చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తండ్రి సల్మాన్.. కొడుకు అర్మాన్‌ను ఓ పిల్లర్‌కు బలంగా కొట్టి నేలపై పడేశాడు. అంతటితో ఆగకుండా బాలుడిని లారీ కిందకు నెట్టేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన స్థానికులు బాలుడిని కాపాడారు. తీవ్రంగా గాయపడిన అర్మాన్‌ను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గుడిమల్కాపూర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని నిందితుడు సల్మాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. సల్మాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలే దారుణానికి కారణమా? లేక మరేదైనా కారణంఉందా? అనే కోణంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది.

# (మొదటిపేజీ తరువాయి)

## తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టు లకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జిఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేంద్రప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాలను కూడా సరిగా వాడటం లేదని మాజీ మంత్రి విమర్శించారు. గోదావరిపై ఉన్న నీళ్లను ఎత్తిపోయడం లేదన్నారు. తెచ్చిన అనుమతులు కూడా ఇప్పుడు రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతి ఇవ్వొద్దని ఏపీ చెబితే ఉఖీఓఃలో పెట్టారని మండిపడ్డారు. బనకచర్ల, మల్లన్నసాగర్ కడతారు కానీ.. సమ్మక్క బ్యారేజీ ఎందుకు వద్దని హరీశ్ రావు ప్రశ్నించారు.ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టు లకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జిఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేంద్రప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాలను కూడా సరిగా వాడటం లేదని మాజీ మంత్రి విమర్శించారు. గోదావరిపై ఉన్న నీళ్లను ఎత్తిపోయడం లేదన్నారు. తెచ్చిన అనుమతులు కూడా ఇప్పుడు రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతి ఇవ్వొద్దని ఏపీ చెబితే ఉఖీఓఃలో పెట్టారని మండిపడ్డారు. బనకచర్ల, మల్లన్నసాగర్ కడతారు కానీ.. సమ్మక్క బ్యారేజీ ఎందుకు వద్దని హరీశ్ రావు ప్రశ్నించారు.

## ఏ ఒక్క అర్హుడికీ అన్యాయం జరగదు

జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు.నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని సూచించారు.రజావాణిలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు. 22ఏ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి హైకోర్టు నిర్దేశించిన 45 రోజుల గడువులోనే అన్ని ప్రక్రియలు పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 22ఎ కు సంబంధించిన కేసులలో కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములపై అక్రమ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. 22ఏ జాబితాలో ఉన్న భూములపై సమగ్ర పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్లకు ఉందని గుర్తుచేస్తూ, ప్రజల హక్కులు ? ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

## డిసెంబర్‌లో 'తెలంగాణ రైజింగ్' గ్లోబల్ సమ్మిట్

విజయవంతం చేయాలని సూచించారు. తెలంగాణను అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఃూష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంపొందించడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో అధికారులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..

తుమ్మిడిహెట్టి వద్ద 148మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రికి గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టివద్ద148మీటర్ల నుంచి 152మీటర్లవరకు ఎత్తుతో బ్యారేజీ నిర్మించే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం నిర్వహించిందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. అధ్యయనం ప్రకారం 148మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా, 152మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందన్నారు. ముంపులోనూ 50 శాతం నదీగర్భం (రివర్ బెడ్)లోనే ఉంటుందని కేంద్ర మంత్రి పాటిల్‌కు సీఎం వివరించారు. 148మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితేగ్రావిటీద్వారా కావల్సినంత నీరు సరఫరాచేయలేమని, కాబట్టి150 నుంచి 152మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర మంత్రి పాటిల్‌ను సీఎం కోరారు. తుమ్మిడిహెట్టివద్ద150 నుంచి 152మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారానే నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. గ్రావిటీ ద్వారా నీటి సరఫరాతో విద్యుత్ వినియోగం భారం ఉండదని, ఈ నేపథ్యంలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు. ఈ అంశంపై సాధ్యమైనంతత్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్యసమావేశం ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే పూర్తిగా వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు నీటి వసతి ఏర్పడుతుందని సీఎం వివరించారు. ప్రధానమంత్రికార్యాలయం నుంచి లేఖ అందిందని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ సీఎం రేవంత్ రెడ్డికి తెలిపారు. ఈ అంశంపై మొదట కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలోసమావేశం ఏర్పాటు చేసి తొలుత తెలంగాణ, మహారాష్ట్ర స్థాయి అధికారులతో చర్చల ప్రక్రియప్రారంభిస్తామని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డికి తెలియజేశారు.

## నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ

చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పురా ప్రాంతంలోని 8 ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఈ ఫోర్జరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేటు కాలేజీ ఫైర్ ఎన్ఓసీలను కూడా అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు. వాటి ప్రామాణికతపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని అక్రమాలకు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# ఎపికి విదేశీ పెట్టుబడుల వెల్లువ

- లోక్‌సభలో వైసిపి సభ్యుడి ప్రశ్నకు కేంద్రం సమాధానం



న్యూఢిల్లీ,ఆగస్ట్5 : ఆంధ్రప్రదేశ్‌కు విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. లోక్‌సభలో లెక్కలతో సహా కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. లోక్‌సభలో వైసీపీ ఎంపీ అడిగిన ప్రశ్నపై కేంద్రం వివరించింది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో కంటే కూటమి ప్రభుత్వ పాలనలో భారీగా విదేశీ పెట్టుబడులు పెరిగాయని కేంద్రం తేల్చిచెప్పింది. 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో రూ.760 కోట్లుగా (92.13 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఉన్నాయని వెల్లడించింది. 2024-25 నాటికి 233.14 మిలియన్ డాలర్లకు విదేశీ ఈక్విటీ పెట్టుబడులు పెరిగాయని పేర్కొంది. 2025 - 26 నాటికి ఏకంగా రూ.5,000 కోట్లకు పైగా (608.59 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఎగబాకినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వైసీపీ హయాంలో పారిశ్రామిక విధానాల్లో అనిశ్చితి వల్ల పెట్టుబడుల ప్రవాహం వెనకబడిందని చెప్పింది. 2025 - 26లో లోహ పరిశ్రమల రంగంలో అత్యధికంగా 250.67 మిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చినట్లు స్పష్టం చేసింది. ఆహార శుద్ధి రంగంలో 107.30 మిలియన్ డాలర్లు, సిమెంట్ ఉత్పత్తుల రంగంలో 99.90 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయని పేర్కొంది. సర్వీసెస్, ఆర్అండ్‌డీ పరిధిలోనూ 2025-26లో 59.96 మిలియన్ డాలర్ల పెట్టుబడులు నమోదైనట్లు వెల్లడించింది. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన అనుకూల పారిశ్రామిక విధానాలు, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో పెట్టుబడులు ఊపం దుకున్నాయని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. వైసీపీ పాలన కంటే కూటమి హయాంలో ఎఫ్‌డీఐల రీసౌండింగ్ గ్రోత్... 92 మిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 608 మిలియన్ డాలర్లకు విదేశీ పెట్టుబడులు చేరాయని వివరించింది. సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, వేగవంతమైన అనుమతులతో ఏపీ వైపు విదేశీ దిగ్గజ సంస్థలు క్యూ కడుతున్నాయని పేర్కొంది. లోహ, ఆహార శుద్ధి, సిమెంట్ రంగాల్లో భారీ పెట్టుబడులు వచ్చాయని కేంద్రం ప్రభుత్వం స్పష్టం చేసింది.

## కోడలు ఇంట్లో అత్తకు నివసించే హక్కు ఉంది

### హిమాచల్ హైకోర్టు సంచలన తీర్పు




సిమ్లా,ఆగస్ట్5 : కోడలి ఇంట్లో అత్తగారు కూడా నివసించే హక్కు ఉంటుందని హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తన సొంత సంపాదనతో కట్టుకున్న ఇంటిలోంచి వెళ్లిపోవాలని అత్తమామలకు కోడలి ఆదేశించడంతో బాధిత అత్తగారు గృహ హింస కింద కేసు పెట్టింది. విచారణ సందర్భంగా ఇల్లు కోడలి పేరు మీద ఉన్నప్పటికీ.. అక్కడ నివసించే హక్కు అత్తగారికి కూడా పూర్తిగా ఉంటుందని న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. మండి జిల్లాల్లోని రామ్‌నగర్‌కు చెందిన వ్యక్తితో 2013, మే నెలలో వివాహం జరిగింది. 2014 వరకు అత్తమామలతోనే కోడలి నివసించింది. అయితే ఇంతలో వివాదాలు తలెత్తడంతో అత్తమామలను ఇంట్లో నుంచి గెంటేసింది. 2025, నవంబర్ 7న ఇంట్లో నుంచి పంపేసి అదదెకు ఇచ్చేసింది. దీంతో అత్తగారు గృహ హింస కేసు పెట్టింది. అయితే తన సొంత సంపాదనతో నిర్మించుకున్న ఇల్లు అని దిగువ కోర్టులో కోడలు పిటిషన్ వేసింది. అయితే ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి రాకేష్ కాంతాలా విచారించి కొట్టేశారు. ఉమ్మడి ఇంట్లో అత్తగారికి హక్కు ఉంటుందని తెలిపింది. అయితే కోడలిపై అత్తగారు పెట్టిన గృహ హింస కేసు తాజాగా హైకోర్టులో విచారణ రాగా.. కోడలి ఇంట్లో అత్తగారికి నివసించే హక్కు ఉంటుందని.. ట్రయల్ కోర్టు తీర్పును సమర్థించింది. ఇరుపక్షాలు కలిసి నివసించినప్పుడు అందరికీ హక్కులు ఉంటాయని తెలిపింది. అత్తమామలు బయటకు పంపేసి అదదెకు ఇవ్వడం ఏ మాత్రం సరైందని కాదని పేర్కొంది. గృహ సంబంధంలో నివసిస్తున్న ప్రతి మహిళకు, ఆమె కుమార్తె, సోదరి, భార్య, కోడలు, అత్త అయినా సరే.. ఉమ్మడి గృహంలో నివసించే చట్టపరమైన హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. ఇల్లు కోడలి పేరు మీద ఉన్నప్పటికీ.. అక్కడ నివసించే హక్కు అత్తగారికి ఉంటుందని హైకోర్టు తేల్చి చెప్పింది.

## భద్రాచలం వద్ద రెండో బ్రిడ్జి నిర్మాణం

- పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల



భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్5 : భద్రాచలం రామాలయం దర్శ నానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం రెండో బ్రిడ్జి నిర్మిస్తు న్నట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగే శ్వరరావు తెలిపారు. 2015 లో గోదావరి పుష్కరాల సందర్భంగా వచ్చిన లక్షలాది మంది భక్తులకు ఒకే బ్రిడ్జి ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బం దులు వచ్చాయని ప్రస్తావిం చారు. భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి పనుల గురించి అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి తుమ్మల మీడియాతో మాట్లా డారు. అమరావతి టూ జగదల్‌పూర్ జాతీయ రహదారిని భద్రాచలం మీదుగా ప్లాన్ చేసి రెండో బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ఈ బ్రిడ్జి అప్రోచ్ వరద కోతకు గురవకుండా రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు వివరించారు. ఈ నెలలో గోదావరి రెండో బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగుతాయని చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అం దుబాటులోకి ఈ బ్రిడ్జిని తీసుకువస్తామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగాయని అన్నారు. ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వయా భద్రాచలం వెళ్లే ప్రయాణికులకు ఈ రెండో బ్రిడ్జి ఎంతో సౌకర్యంగా ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## తెలంగాణలో డయల్ 112 సేవలు ప్రారంభం




- పోలీస్,ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్
- సేవలను ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్

హైదరాబాద్,ఆగస్ట్5 : తెలంగాణలో డయల్ 112 సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఏ ఫిర్యాదుకైనా ఇక 112 ద్వా రా సమాధానం వస్తుంది. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కమా ండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గమని వ్యాఖ్యా నించారు. డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు పోలీసులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు.ఒకే వ్యవస్థలోకి పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు, టిజిఐసిసి నుంచి డయల్ 112 సేవలను పర్యవేక్షి స్తామని డీజీపీ తెలిపారు. ప్రజల భద్రత, అత్యవసర స్పందన సామ ర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వెల్లడిం చారు. డయల్ 112 ఫోన్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్ ఆల్స్ వాడుతున్నామని పేర్కొన్నారు. డ్రోన్ బెస్డ్ టెక్ని కల్ సిస్టంను త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగి స్తారని వివరించారు. డ్రోన్ టీమ్‌ను సైతం ఏర్పాటు చేయబో తున్నామని చెప్పుకొచ్చారు. డయల్ 112 అనేది 3.0 వర్షన్ గా ఉంటుందని తెలిపారు. యువ ఏపీఎస్‌లు, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయబో తున్నామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. బేసిక్ పోలీసింగ్ లాగా టెక్నాలజీ పోలీసింగ్‌ను అమల్లోకి తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్‌లో రెండు ఫ్లోర్‌లను డయల్ 112కి కేటాయించామని తెలిపారు. డయల్ 100ను 2013లో కొంపల్లిలో జివికె వారి సాయంతో ప్రారంభించా మని ప్రస్తావించారు. వివిధ అత్యవసరా లకు ఒకే నంబర్ ఉం డాలని గతంలో కేంద్రప్రభుత్వం సూచించిందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ వచ్చామని అన్నారు. ఇటీవల ఏఐ వచ్చాక అనేక పనులు సులువుగా అయిపోతున్నాయని డీజీపీ ఆనంద్ వెల్లడించారు.

## జార్ఖండ్ నిరుద్యోగులకు సిజెపి మద్దతు

### దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తాం

### రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

### సిజెపి నేత అభిజిత్ దీప్కే స్పష్టీకరణ

ముంబై,ఆగస్ట్5 : జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడిన దీప్కే, జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతీ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా, ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, మీడియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

## కృష్ణాకి పెరుగుతున్న వరద

నారాయణపేట,ఆగస్ట్5 : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి భారీ వర్షాల కారణంగా కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కృష్ణ నదిపై నిర్మించిన గుర్జాపూర్, యాదగిరి జిల్లా గూడూరు భీమా నదిపై ఉన్న గుగ్గల్ బ్యారేజీకి వరద నీరు పోటెత్తడంతో ఈ బ్యారేజీ 40 గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద జలాలు తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టు కు చేరుతుండటంతో నది పరివాహక ప్రాంతం జలకళను సంతరించుకుంది. నది పూర్తిగా నీటితో నిండిపోవడంతో తెలంగాణ- కర్ణాటక సరిహద్దులోని కృష్ణ బ్రిడ్జి కింద ప్రవహిస్తున్న వరద ప్రవాహం ఆహ్లాదకర దృశ్యాన్ని తలపిస్తోంది. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులతో పాటు ప్రయాణికులు కూడా బ్రిడ్జి వద్దకు చేరుకుని ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు. కృష్ణానదిలో ప్రవాహం రోజురోజుకు వరద ప్రవాహం పెరుగుతుందడడంతో జూరాల ప్రాజెక్టు అధికారులు ఎప్పటి కప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, వరద ఉధృతి కారణంగా నదిలో స్నానాలు చేయకుండా, చేపల వేటకు వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

## ఎయిర్‌పోర్టుకు రోడ్డు ఇవ్వొద్దు

- గ్రామస్థుల ధర్నా

ఆదిలాబాద్,ఆగస్ట్5 : ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ఎయిర్‌పోర్టు కోసం తమ గ్రామ రోడ్డును తీసుకుంటే మొత్తం గ్రామాన్ని తీసుకోవాలని కోరుతూ అనుకుంటా గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. బుధవారం గ్రామానికి చెందిన రైతులు కలెక్టరేట్‌కు తరలివచ్చి బైఠాయించి నిరసన తెలిపారు.ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల నష్టపోతున్న తమ భూములకు రూ.6 కోట్లు చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. గ్రామస్థులు ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణానికి చేరుకోవాలంటే కేవలం రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ప్రయాణం చేస్తుండగా రోడ్డు ఎయిర్‌పోర్టులో పోతే 16 కిలోమీటర్లు దూర భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశముందని పేర్కొన్నారు. రోడ్డుతో పాటు తమ గ్రామాన్ని మొత్తం తీసుకొని ఇతర ప్రాంతంలో తమకు పునరావసం కల్పించాలని కోరారు.

## ఇంటిని కూల్చి రోడ్డున పడేశారు

రామగుండం,ఆగస్ట్5 : 20 ఏండ్ల నాటి ఇంటిని ఎందుకు కూల్చారని రెండు రోజులుగా అన్నపానీయాలు లేకుండా న్యాయం కోసం బల్దియా మెట్లు ఎక్కితే ఒక్కరూ పట్టించుకోవడం లేదని బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక మాకు దిక్కెవరని, మాకు న్యాయం జరగదా..? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి నుంచి వచ్చేసరికి ఇంటిని కూల్చివేశారని బాధిత కుటుంబం బుధవారం గోడు వెల్లబోసుకుంది. రెండో రోజు రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగం ఎదుట సుమారు నాలుగు గంటల పాటు నిరసన తెలిపారు. గర పాలక సంస్థ 21వ డివిజన్ పరిధిలోని ఎల్కలపల్లి గేట్‌లో మీనుగు లిఖిత అనే మహిళ నివాసం ఉంటుంది. తన ఇంటిని నెల రోజుల క్రితం మున్సిపల్ అధికారులు వచ్చి కూల్చివేశారని ఆరోపిస్తూ తన అత్తమామలు, ఆడబిడ్డ, చంటి పిల్లలతో కలిసి మున్సిపల్ ఆఫీసు ఎదుట మంగళవారం రోజంతా బైఠాయించిన సంగతి విషయం తెలిసిందే. రెండో రోజు బుధవారం కూడా కుటుంబ సభ్యులతో కార్యాలయానికి చేరుకొని టౌన్ ఎలానింగ్ విభాగం చాంబర్ ఎదుట న్యాయం కోసం అధికారులను ప్రాధేయపడినట్లు తెలిపారు. బాధితు రాలు మాట్లాడుతూ తాము ఇంట్లో లేని సమయంలో మున్సిపల్ సిబ్బందివచ్చి ఇంటిని కూల్చివేశారని, ఆసమయంలో ఇంటిలో విలు వైన బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులు ఉన్నాయని వాపో యారు. 20 ఏండ్ల నుంచి ఉంటున్న ఇంటిని కూల్చివేయడానికి గల కారణాలు అడిగితే.. పై అధికారుల నుంచి ఆర్డర్ అని అంటున్నారని పేర్కొన్నారు. తమకు ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని వాపోయారు. కూల్చిన ఇంటికి నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

## సంపాదకీయం

# బిజెపి ఆత్మపరిశీలనకు ఇదే సమయం !

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మేల్కోవాల్సిన సమయం వచ్చింది. ఇక్కడ బిజెపి అంటే మోడీ, అమిత్ షా మాత్రమే అని చెప్పుకోవాలి. ఎందుకంటే అధికారంలోనూ, పార్టీలోనూ ఈ ఇద్దరిదే పెత్తనం కనుక వీరిద్దరు మేల్కొంటే బిజెపి మేల్కొన్నట్లుగానే చూడాలి. ఎందుకంటే బిజెపి పాలనలో ప్రజల పట్ల మెల్లగా వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. వీటిని ఆ ఇద్దరు ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ఉప ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో బిజెపి కేవలం గుజరాత్‌లో ఒక్కసీటు మాత్రమే గెల్చుకోలిగింది. బీహార్, మధ్యప్రదేశ్‌లలో అధికారంలో ఉన్నా, అక్కడ గెలవలేదు. సాధారణంగా అధికారంలో ఉన్నచోట ఉప ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులే గెలుస్తారు. కానీ అనూహ్యంగా బిజెపి పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకత కనబర్చారు. మొన్నటికి మొన్న నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు గళమెత్తారు. విద్యార్థుల పార్లమెంటు ముట్టడి గర్జనకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే చేయక తప్పని పరిస్థితి వచ్చింది. ఇది తమ ఎత్తుగడే అని బిజెపి నేతలు సమర్థించుకున్నా అంతిమంగా విజయం విద్యార్థుల వైపే ఉంది. తాము ఎన్నుకున్న ప్రభుత్వాలే తమ భవిష్యత్తును నట్టేట ముంచుతుంటే ఓపిక, సహనం నశించి తీవ్రమైన ఆవేదన, ఆవేశం, ఆక్రోశంతో యువత రగిలి చేసిన పోరాటంగా దీనిని చూడాలి. ప్రారంభంలో విద్యార్థుల పోరాటాన్ని బేఖాతరు చేసిన ప్రధాన మీడియా చానెళ్లు కూడా తదనంతరం తప్పనిసరి పరిస్థితుల్లో మేల్కొన్నాయి. వారి పోరాటాన్ని గుర్తించక తప్పలేదు. ఈ పోరాటం వెనక ఎవరు ఉన్నారన్నది తెలుసుకుంటూనే, విద్యార్థుల్లో ముఖ్యంగా యువతలో నిద్రాణంగా ఉన్న ఆక్రోశాన్ని కూడా గుర్తించాలి. అందుకే బిజెపి నేతలు విదేశీ హస్తం ఉంటే గుర్తించి చర్యలు తీసుకోవడం ఒక ఎత్తయితే..యువతలో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆందోళనలను కూడా గుర్తించాలి. విద్యార్థులు చేసిన ఏ ఉద్యమం కూడా విఫలమైనట్టు ప్రపంచ చరిత్రలో లేదు. అది వివిధ దేశాల స్వాతంత్ర్య ఉద్యమాల నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు ఇప్పుడు కాక్రోచ్‌ల ఉద్యమం వరకు రుజువైంది. విద్యార్థులు, యువతతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలూ, పార్టీలూ మనుగడ సాగించలేవు. ఎంతటి బలమైన నియంతృత్వ ప్రభుత్వమైనా విద్యార్థుల పోరాటానికి తారుమారైన చరిత్ర ఉంది. విద్యార్థులే కదా అని అలుసుగా తీసుకుంటే అధికారం గల్లంతవుతుంది. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, ఇతర ఆఫ్రికా దేశాల్లో జరిగిన అనేక ప్రజా ఉద్యమాలను చూసిన తరవాత మనం కూడా జాగ్రత్త పడాలి. అలాంటి పరిస్థితి ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో భవిష్యత్తులో రాకుండా ఉండాలంటే సమస్యలను పక్షపాత ధోరణితో సాగదీయకుండా పాలకులు, ప్రభుత్వాలు పరిష్కరించాలి. అధికారం శాశ్వతం అనుకుంటే... వారి రాజకీయ మనుగడకు ప్రమాదం వాటిల్లుతుంది. భవిష్యత్తులో ఇంతకంటే తీవ్ర స్థాయిలో విద్య, ఉద్యోగ, రాజకీయంగా అణచివేయబడ్డ అనేక సామాజిక వర్గాల నుంచి ప్రతిఘటనలు ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తించాలి. ఇకపోతే ఇదొక్కటే అనుకుంటే పొరపాటు. ఎన్నికల్లో కూడా ప్రజలు మెల్లగా మోడీ పాలనపై వ్యతిరేకత వ్యక్త పరుస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని 242 సీట్లకు పరిమితం చేశారు. ఇదే మొదటి హెచ్చరిక. ఇక ఇప్పుడు తాజా ఉప ఎన్నికల ఫలితాలు మరో హెచ్చరికగా చూడాలి. చాపకింద నీరులా ప్రజల్లో నివురుగప్పిన అసంతృప్తిని గుర్తించాలి. పాలనలో మూస పద్ధతి నుంచి బయటపడాలి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, పన్నులు వంటివి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఆస్పత్రులు, విద్యారంగం మరీ దిగజారి పోతున్నాయి. సమాజంలో ప్రతి ఒక్క రంగం జనాలను జలగల్లా పీల్చి పిప్పి చేస్తున్నాయి. వీటిని తక్షణం సమీక్షించుకోక పోతే ఇది పెను ఉప్పెనలా విరుచుకు పడడం ఖాయం. ఎందుకంటే ఉప ఎన్నికలు, విద్యార్థుల ఆందోళనలను బిజెపి నేతలు సీరియస్‌గా తీసుకుని సమీక్షించుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఇది. బిహార్‌లోని బాంకీపూర్ శాసనసభ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ అధినేత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ విజయం రాష్ట్ర, దేశ రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ఉప ఎన్నికలో ఆయన నీరజ్‌కుమార్ సిన్హా అనే బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించి ఉండవచ్చు. కానీ, నిజానికి ఆయన ఓడించింది బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్‌నే అని గుర్తించాలి. ఒక్క నితిన్‌నే కాదు మోడీ, అమిత్ షాలను అని కూడా గుర్తించాలి. పదిహేనేళ్ళ క్రితం వరకూ పాట్నా వెస్ట్‌గా ఉన్న ఈ అర్బన్ అసెంబ్లీ స్థానాన్ని వరుసగా ఐదుసార్లు ఘనంగా నెగ్గుకొచ్చిన నితిన్ నబీన్ రాజ్యసభకు తరలడంతో ఈ ఉపఎన్నిక అనివార్యం అయ్యింది. దీనికితోడు, బీజేపీ అధ్యక్షుడి కంటే ముందు ఆయన తండ్రి కిశోర్ ప్రసాద్‌సిన్హా సైతం ఏకబిగిన పలుమార్లు గెలుచుకున్నస్థానం కావడంతో ఈ శాసనసభ ఉపఎన్నిక ఫలితం యావత్ దేశాన్ని ఆకర్షించింది. బిహార్‌లో సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని తొలి బీజేపీ ప్రభుత్వానికి ఎదురైన తొలి ఎన్నికల పరీక్ష ఇది. కాయస్థ, భూమిహార్, రాజ్‌పుట్ ఇత్యాది అగ్రకులాల సంఖ్యాబలం గణనీయంగా ఉన్న ఈ స్థానం చేజారిపోవడం కచ్చితంగా ఆ పార్టీ పెద్దలకు ఆందోళన కలిగించే అంశం. గత ఏడాది ఎన్నికల్లో ఆర్జేడీ అభ్యర్థిపై నితిన్ నబీన్ యాభైవేల మెజారిటీతో గెలిచారన్నది దృష్టిలో ఉంచుకుంటే ఇప్పటి పరాజయం తీవ్రత అర్థమవుతుంది. నీట్ పరీక్షలో అవకతవకలు, పిల్లల ఆత్మహత్యలు, ఉధృతంగా సాగిన జెన్‌జీ ఉద్యమం, ఉద్యోగ ఉపాధి అవకాశాల లేమి వంటివి ఈ ఫలితాలను ప్రభావితం చేశాయని చెప్పకతప్పదు. బీజేపీకి గుణపాఠం నేర్పాలన్న లక్ష్యంతో యువతతో పాటు, వారి మనోభావాలకు అనుగుణంగా మధ్యవయసువారు, వృద్ధులు కూడా ఓట్లేశారని, అన్ని కులాలవారు, రంగాలవారు ఏకరీతిన నడిచారని విశ్లేషణలు చెబుతున్నాయి. దేశంలో ప్రతిపక్షపార్టీలు బలహీనంగా ఉండవచ్చు, కానీ, ప్రతిపక్ష స్థానం మాత్రం బలంగానే ఉంది అంటూ పీకే చేసిన వ్యాఖ్యను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ఇవి కొన్ని హెచ్చరికలు మాత్రమే. అలాగే ఆత్మపరిశీలన చేసుకోవడానికి వచ్చిన అవకాశంగా బిజెపిలోని మిత్రద్వయం గుర్తించాల్సిన సమయమిది. దేశంలో పాలన బాగుందని తమకు తాము భుజాలు ఎగరేసుకుంటే సరికాదు. ప్రజలు ఏమనుకుంటున్నారో అన్నది తెలుసుకోవడం ముఖ్యం. ముఖ్యంగా విద్యార్థుల కోణంలో విద్యారంగంలో గణనీయమైన మార్పులకు శ్రీకారం చుట్టాలి. ఉపాధి, ఉద్యోగ రంగాల్లో మార్పులను తీసుకుని రావాలి. యువత వీటికోసం ఎదురు చూస్తోంది. పన్నులు, ధరలు, విద్యారంగ దోపిడీ, వైద్యరంగంలో దోపిడీ గురించి సామాన్య ప్రజలు సైతం ఆగ్రహంగా ఉన్నారు. ఇవన్నీ కూడా పరిష్కరించగలిగినవే. రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులతో ప్రజలకు పాలనను చేరువ చేయగలిగే సమర్థతను ప్రదర్శించగలిగిన్పుడే బిజెపి మనుగడ కొనసాగుతుంది.

# చర్చలకు రాకుండా మోసపూరిత వ్యవహారం

- ఇరాన్‌కు మరోమారు ట్రంప్ అల్టిమేటం
- ఇరాన్‌ను లొంగదీసుకునే ప్రత్యామ్నాయాలపై గురి




వాషింగ్టన్,ఆగస్ట్5 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ నాయకత్వానికి అల్టిమేటం ఇచ్చారు. అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని.. అలాకాకపోతే పూర్తిగా లొంగిపోవాలని తేల్చి చెప్పారు. సోమవారం తన సొంత సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ది ట్రూత్ సోషల్‌లో ఓ సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో ఇరాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్ మోసపూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఇరాన్ చర్చల కోసం తమను ప్రాధేయపడిందని, ఇప్పుడు బహిరంగంగా చర్చలు కుదరవంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ దీన్ని అంగీకరించినా.. అంగీకరించకపోయినా.. దశాబ్దాలుగా వాళ్లు సృష్టించిన ఓ సమస్యకు పరిష్కారం గురించి మేము మాట్లాడుతున్నాం. హోర్ముజ్‌పై తమ నియంత్రణ కొనసాగుతుందని ఇరాన్ నాయకత్వం ఎప్పటిలాగే వ్యర్థమైన మాటలు చెబుతోంది. కానీ, హోర్ముజ్ జలసంధి ఇప్పటికే అమెరికా నియంత్రణలో ఉంది. హోర్ముజ్ 'ది యునైటెడ్ స్టేట్స్ వాల్ ఆఫ్ స్టీల్' కంట్రోల్‌లో ఉంది. జలసంధిలో ప్రయాణం పూర్తిగా అమెరికా ఇష్టాయిష్టాలపైనే ఆధారపడి ఉంటుంది. ఇరాన్ వద్ద ఎప్పటికీ అణ్వాయుధం ఉండదు' అని స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించడం కోసం అమెరికా పెట్టిన షరతులను ఇరాన్ అంగీకరించట్లేదు. ఈ నేపథ్యంలోనే టెహ్రాన్‌ను టార్గెట్ చేసేందుకు కొత్త మార్గాలు వెతకాలని అమెరికా సెంట్రల్ కమాండ్ తమ బలగాలకు ఈ-మెయిల్ పంపినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చి, దాని అణు కార్యక్రమాలను నిలిపివేసేలా చేయడం కోసం వినూత్న, సంప్రదాయేతర సూచనలు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. దీంతో ఇప్పటి వరకు టెహ్రాన్‌పై దాడులకు వాషింగ్టన్ అమలు చేసిన వ్యూహాన్ని సెంట్రల్ కమాండ్ అధికారులు పునఃపరిశీలిస్తున్నారని సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్‌పై భారీ స్థాయిలో దాడులు చేపడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతవారం హెచ్చరించిన సంగతి తెలిసిందే. అయితే, సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ జోక్యంతో భీకర దాడుల నుంచి ట్రంప్ వెనక్కి తగ్గారు. కాగా.. అధ్యక్షుడి హెచ్చరికల కంటే ముందే అమెరికా సెంట్రల్ కమాండ్ తమ బలగాలకు ఈ-మెయిల్ పంపించినట్లు తెలుస్తోంది. ఇరాన్‌ను తిరిగి చర్చలకు తీసుకురావడమే లక్ష్యంగా అమెరికా కొన్ని వారాలుగా నిరంతర వైమానిక దాడులు చేస్తూనే ఉంది. అయినప్పటికీ ఒప్పందం కుదిరే సూచనలు కనిపించకపోవడంతో.. టెహ్రాన్‌ను శిక్షించడంపై అగ్రరాజ్యం ఇప్పుడు దృష్టి సారించినట్లు సమాచారం.ఒప్పందంపై తుది నిర్ణయానికి రావడానికి ఇరాన్‌కు 'చివరి అవకాశం' ఇచ్చామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో చేపట్టిన దాడులకంటే తీవ్రంగా ఇరాన్‌పై విరుచుకుపడడానికి తమ దళాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. కానీ యుద్ధం ముగింపునకు దౌత్య మార్గాలు అనుసరించాలని ఇరాన్‌తో సహా సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ చేసిన అభ్యర్థనల మేరకు సైనిక దాడిని నిలిపివేశామన్నారు. ప్రస్తుతం ఇరుదేశాల ప్రతినిధుల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయన్నారు. ఈ అవకాశాన్ని వారు వినియోగించుకోకపోతే ఇక టెహ్రాన్‌ను వదిలే సమస్యే లేదన్నారు. మరోవైపు మంగళవారం తెల్లవారుజామున కువైట్, ఇరాక్‌లోని అమెరికా స్థావరాలపై ఐఆర్‌జీసీ డ్రోన్ దాడులు చేపట్టింది.

## ట్రంప్ సుంకాల నిర్ణయాలపై చిక్కులు

### న్యాయస్థానాల్లో సవాల్ చేసిన 25 రాష్ట్రాలు



వాషింగ్టన్,ఆగస్ట్5 : సుంకాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీసుకున్న నిర్ణయం ఇప్పుడు న్యాయపరమైన చిక్కుల్లో పడింది. భారత్‌తో సహా 60 భాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన కొత్త పన్నులను సవాలు చేస్తూ.. అమెరికాలోని 25 డెమోక్రటిక్ పార్టీ నేతృత్వంలోని రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ ప్రభుత్వం తమ చట్టబద్ధమైన పరిమితులను దాటి వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ దావా వేశాయి. న్యూయార్క్‌లోని 'యుఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్'లో 25 రాష్ట్రాల కూటమి ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. వెట్టి చాకిరీ ద్వారా తయారుచేసిన వస్తువుల దిగుమతులపై సరైన నిషేధం అమలు చేయడం లేదనే ఆరోపణలతో గత నెలలో ట్రంప్ ప్రభుత్వం సుంకాలను విధించింది. భారత్ సహా దాదాపు 60 భాగస్వామ్య దేశాల నుంచి వచ్చే దిగుమతులపై 10 శాతం నుంచి 12.5 శాతం వరకు కొత్త సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సుంకాల వల్ల వినియోగదారులు, వ్యాపారాలపై భారం పడుతుందన్న 25 రాష్ట్రాలుఇప్పుడు కోర్టును ఆశ్రయించాయి. ఇంతకు ముందు కూడా ట్రంప్ విధించిన అనేక సుంకాల నిర్ణయాలు అమెరికా కోర్టులలో చట్టపరమైన చిక్కులను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ కొత్త టారిఫ్‌లపై నమోదైన కేసు ట్రంప్ వాణిజ్య విధానాలకు మరో పెద్ద పరీక్షగా మారనుంది. ప్రారంభంలో భారత్‌పై 12.5 శాతం టారిఫ్ విధించాలని ప్రతిపాదించినప్పటికీ.. వెట్టి చాకిరీ నిరోధక చట్టాల అమలును భారత్ వేగవంతం చేయడంతో ఈ పన్నును 10 శాతానికి తగ్గించారు. చమురు, సహజ వాయువు, ఎరువుల దిగుమతులకు, అలాగే యూఎస్-మెక్సికో-కెనడా వాణిజ్య ఒప్పందం పరిధిలోకి వచ్చే వస్తువులకు ఈ పన్నుల నుంచి మినహాయింపు ఇచ్చారు.

# ప్రశాంత్ కిశోర్ విజయంతో మారనున్న సమీకరణాలు

- బిజెపి సహా అన్ని పార్టీలకు ఇక ముప్పే



పాట్నా,ఆగస్ట్5 : బీహార్‌లో బిజెపి తీరును ప్రజలు వ్యతిరేకిసక్తున్నారనడానికి బాంకీపూర్ ఉప ఎన్నిక ఫలితమే నిదర్శనమని చెప్పాలి. బిజెపి కంచుకోటను వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బద్దలు కొట్టారు. నిజానికి అక్కడ ప్రజలు బిజెపి పట్లా అదే విధేయతను ప్రకటించడం లేదని తేలింది. బాంకీపూర్‌ను నిలబెట్టుకోవడం కోసం బీజేపీ అన్ని అడ్డదారులూ తొక్కిందని, పోలీసు ఉన్నతాధికారులు దానికి ఏజెంట్లుగా పనిచేశారని, తన పార్టీ కార్యకర్తలను జైళ్ళలో కుక్కారని ప్రశాంత్ కిశోర్ పెద్ద పెద్ద ఆరోపణలు చేశారు. అయినా బిజెపి గెలవలేక పోయిందని విమర్శించారు. ఐదేళ్ళక్రితం ఎన్నికల వ్యూహకర్త పాత్రకు స్వస్తిచెప్పి, రెండేళ్ళపాటు బిహార్ అంతా కాలినడకన కలయదిరిగి, ఒక ఆదర్శవంతమైన మేనిఫెస్టోతో ఆయన రాజకీయ రంగప్రవేశం చేశాడు. తాను ఎన్నికల్లో నిలబడకుండా, ఓ ఐదు అసెంబ్లీ స్థానాలు మినహా అన్నింటిలోనూ తన పార్టీ అభ్యర్థులను నిలబెట్టాడు. ఓ మూడున్నరశాతం ఓటువాటా దక్కింది కానీ, ఒక్కరంటే ఒక్కరు కూడా గెలవలేదు. ఆ ఘోర పరాజయం నుంచి ఏడాది తిరిగేసరికి ఇప్పుడు దక్కిన విజయం ఆయనకు పెద్ద ఉపశమనం. తాను ఇప్పుడు ఓడినా పోయేదేమీ లేదని, ఒకవేళ నెగ్గితే, ఏకంగా బీజేపీ అధ్యక్షుడి కుటుంబాన్ని ఢీకొని, కంచుకోటను స్వాధీనం చేసుకున్న ఘనత దక్కుతుందని పీకే అనుకొనివుంటారు. ఒక ఎమ్మెల్యే సీటు కంటే, దేశంలో కొద్దినెలలుగా చోటుచేసుకుంటున్న పరిణామాల ప్రభావం ఓటర్లమీద ఏ స్థాయిలో ఉన్నదో, బిహార్ ఓటర్లు ప్రత్యామ్నాయం గురించి చూస్తున్నదీ లేనిదీ తేల్చుకోవాలనుకొని ఉంటారు. అగ్రకులాలతో పాటు, యాదవులు, ముస్లింలు, దళితులు, ఎంబీసీ, ఈబీసీ ఓటర్లు సైతం ప్రశాంత్‌కిశోర్‌కు ఓటుచేయడం వల్లనే 20వేల మెజారిటీ సాధ్యపడిందని విశ్లేషకుల అభిప్రాయం. సర్వసాధారణంగా ఉపఎన్నికల్లో అధికారపార్టీయే విజయాలు సాధిస్తుంది. కానీ, బిహార్ పరిస్థితి వేరు. శాసనసభ ఎన్నికల పోరుకు సారథ్యం వహించి, కూటమిని గెలిపించి, అనేక నాటకీయ పరిణామాల మధ్య అనతికాలంలోనే నితీశ్‌కుమార్ తప్పుకున్నారు. అనూహ్యంగా తెరమీదకు వచ్చిన తొలి బీజేపీ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి మీద రాష్ట్ర ప్రజల తొలి తీర్పు ఇది అని పీకే పార్టీ ఆరోపిస్తోంది. బిహార్‌తో పాటు, తన ఏలుబడిలో ఉన్న మధ్యప్రదేశ్‌లోనూ మరో స్థానాన్ని కోల్పోయిన బీజేపీకి, మోదీ స్వరాష్ట్రం గుజరాత్ ఒక్కటే ఉపశమనాన్ని ఇచ్చింది. ఇదంతా ఒక్ ఎత్తయితే బీహార్‌లో ప్రశాంత్ కిశోర్ రాజకీయ ప్రస్థానానికి పునాది పడిందని చెప్పుకోవాలి. ఈ ఒక్కసీటుతో పికె ఇక దూకుడు ప్రదర్శించే అవకాశం ఉంది. బిజెపి, ఆర్జెడి, నితీశ్ పార్టీలో ఉన్న అసంతృప్తిని తనకు అనుకూలంగా మలచుకునే సత్తా పికెకు ఉంది. రానున్న రోజుల్లో అక్కడ పికె ప్రభావం పెరిగినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు.

# మరో బాదుడుకు సిద్ధం అవుతున్న ట్రంప్

- హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్ల రెన్యువల్స్‌పై అదనపు ఫీజు



వాషింగ్టన్,ఆగస్ట్5 : వలసలపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ సర్కారు మరో వీసా ఫీజును తెరపైకి తెచ్చింది. బడా కార్పొరేషన్ల హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్ల రెన్యువల్స్‌పై అదనపు ఫీజు విధించేలా ప్రతిపాదనలను సిద్ధం చేస్తుంది. ఈ దిశగా 9-11 రెస్పాన్స్ అండ్ బయోమెట్రిక్ ఎంట్రీ-ఎగ్జిట్ ఫీజును వీసా రెన్యూవల్స్‌కు వర్తించేలా రూపొందించిన నిబం ధనలు తుది రూల్ మేకింగ్ దశకు చేరుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇది అమల్లోకి వస్తే కంపెనీలకు హెచ్-1బీ వీసాదా రులను కొనసాగించడం మరింత భారంగా మారుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సగానికి పైగా హెచ్-1బీ వీసాదారులు, ఎల్-1వీ వీసాదారులు ఉన్న అమెరికన్ కంపెనీలపై ఈ అదనపు ఫీజును విధించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ, కార్మిక శాఖ, విదేశాంగ శాఖ కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఇలాంటి బడా సంస్థలు కొత్త విదేశీ వర్కర్లను స్పాన్సర్ చేసే సమయంలో హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్లపై అదనంగా 4 వేల డాలర్ల ఫీజును చెల్లిస్తున్నాయి. ఇకపై విదేశీ ఉద్యోగిని కొనసాగించేందుకు చేసే రెన్యూవల్స్ విషయం లోనూ ట్రంప్ సర్కారు అదనపు ఫీజు విధించే అవకాశం ఉంది. అమెరికా పౌరసత్వ, వలస సేవల శాఖ లెక్కల ప్రకారం, ప్రభుత్వం జారీ చేసే హెచ్-1బీ అనుమత్లో అధిక శాతం రెన్యువ ల్స్‌కు సంబంధించినవే. 2025 సెప్టెంబర్ 30తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 4.06 లక్షల హెచ్-1బీ అప్లికేషన్లను ఆమోదిం చగా వాటిల్లో 71శాతం రెన్యూవల్స్‌కు సంబంధించినవేనని తేలింది. కాబట్టి ఈ ఫీజు కూడా అమ ల్లోకి వస్తేభారతీయులపై మరింత భారం పెరిగే అవకాశం ఉందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# విద్య కేవలం ఉద్యోగం కోసమే కాదు

- వ్యక్తిత్వ వికాసానికి కూడా విద్య అవసరం
- మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు




విజయవాడ,ఆగస్ట్5 : విద్య అనేది కేవలం ఉద్యోగం పొందడానికి మాత్రమే కాకుండా, వ్యక్తిత్వ వికాసానికి, దేశ నిర్మాణానికి దోహదపడాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. అమరావతిలోని అమృత యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో మంత్రి లోకేష్‌తో పాటు వెంకయ్య నాయుడు కూడా పాల్గొన్నారు. పట్టభద్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. 'విదేశాల్లో చదువుకున్నా మనదేశానికి వచ్చి సేవ చేయండి. చదువు సంస్కారం నేర్పాలి. సూర్యోదయం నుంచి సూర్యాస్తమ యంలోపు మీ పనులు పూర్తి చేసుకొండి. తల్లిదండ్రులతో కలిసి సమయం గడపండి. కుటుంబ వ్యవస్థకు మూలం భారత్. ప్రపంచంలో భారత్ శక్తి వంతమైన దేశం. భారత్ విశ్వ గురువు. గతంలో ప్రపంచంలోని పలు దేశాల విద్యార్థులు మన దేశంలోని నలందా, తక్షశిల లాంటి యూనివర్సిటీల్లో చదువుకున్నారు' అని వెంకయ్య పేర్కొన్నారు. నేను స్కూల్ నుంచే విద్యార్థి నాయకుడిగా పని చేశా. ఎమర్జెన్సీ టైమ్‌లో 17 నెలలు పాటు జైల్లో ఉన్నా. 1983లో ఎమ్మెల్యేగా గెలిచా. రాజకీయాల్లో ఉండగా నా జేబు నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. నా నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో 30 ఏళ్లు ప్రతిపక్షంలోనే ఉన్నా. నేను ఒకప్పుడు వాజపేయి పేరు గోడ మీద రాశాను. అదే వాజపేయితో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఒకే వేదికపై కూర్చున్నా' అని వెంకయ్య గుర్తు చేసుకున్నారు. అంతకు ముందు మంత్రి నారాలోకేష్ కూడా మాట్లాడారు. భవిష్యత్ అవకాశాలను అందుపుచ్చుకునేలా విద్యారంగంలో సమూల మార్పులు రావాలని లోకేష్ ఆకాంక్షించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతమైన ఎకోసిస్టమ్ నిర్మాణం జరుగుతోందన్నారు. వైఫల్యాలను చూసి భయపడొద్దని, ఆత్మవిశ్వాసంతో యువత ముందుకు సాగాలని సూచించారు. జీవితంలో ఉన్నత స్థానానికి చేరాలంటే కఠినమైన మార్గాన్ని మాత్రమే ఎంచుకోవాలని అన్నారు.



# ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై తీవ్ర దాడి తప్పదు

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక**

**బలగం టీవీ, వాషింగ్టన్**

ఇరాన్‌తో తాత్కాలిక ఒప్పందం కుదిరితే వ్యూహాత్మక 'హర్మూజ్ జలసంధి' త్వరలోనే తిరిగి తెరుచుకుంటుందని, ఒకవేళ టెహ్రాన్ దీనికి అంగీకరించకపోతే ఆ దేశంపై తీవ్రస్థాయి సైనిక దాడి తప్పదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలను సాధించనివ్వబోమని ఆయన పునరుద్ఘాటించారు.



ఒక ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడారు. ఇరాన్ స్వయంగా చర్చలకు విజ్ఞప్తి చేయడంతోనే తాము తాత్కాలికంగా దాడి ఆలోచనను పక్కనబెట్టి దౌత్య మార్గాన్ని ఎంచుకున్నామని వెల్లడించారు.

ప్రతిపాదిత ఒప్పందంలో ముఖ్య అంశాలు (ఆక్సియోస్ నివేదిక ప్రకారం):

60 రోజుల తాత్కాలిక ఏర్పాటు: హర్మూజ్ జలసంధిలో సముద్ర రవాణాను పునరుద్ధరించేందుకు యూఎస్, ఇరాన్, ఒమన్ ల మధ్య 60 రోజుల ఒప్పందంపై చర్చలు తుదిదశకు చేరాయి.

ఉచిత నౌకాయానం: గల్ఫ్‌లోకి వచ్చే వాణిజ్య నౌకలు ఇరాన్ జలాల మీదుగా ప్రయాణిస్తాయి. వీటిపై ఎలాంటి టోల్ ఛార్జీలు లేదా రవాణా రుసుములు విధించరు.

మైన్ల తొలగింపు: జలసంధిలో అమర్చిన నేవల్ మైన్స్‌ను 30 రోజుల్లోగా తొలగించాల్సి ఉంటుంది.

అణు చర్చల పునరుద్ధరణ: ఈ తాత్కాలిక శాంతి ఒప్పందం ద్వారా ఇరాన్ అణు కార్యక్రమంపై నిలిచిపోయిన చర్చలను మళ్లీ ప్రారంభించడమే ప్రధాన లక్ష్యం.

అంగీకారానికి చేరువలో ఇరాన్?

అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్ కాఫ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, ఒమన్ అధికారుల మధ్య ఈ చర్చలు వేగంగా సాగుతున్నాయి. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ నుంచి కూడా ఈ ఒప్పందానికి సూత్రప్రాయ ఆమోదం లభించిందని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని యూఎస్ వర్గాలు తెలిపాయి. ఒకవేళ ఇరాన్ మళ్లీ వెనక్కి తగ్గితే రెండో ప్రపంచ యుద్ధం తర్వాత చూడని స్థాయిలో భారీ దాడి ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రంప్ స్పష్టం చేశారు.

# అమెరికా చర్యలు ఆపితేనే రాకపోకలు పునరుద్ధరణ

**- స్పష్టం చేసిన ఇరాన్**

**బలగం టీవీ, టెహ్రాన్**

హర్మూజ్ జలసంధిలో సాధారణ నౌకా రాకపోకలు పునరుద్ధరించబడాలంటే కేవలం ఒమాన్‌తో జరిపే చర్చలు మాత్రమే సరిపోవని, అమెరికా తన ఆంక్షలు మరియు మిలిటరీ చర్యలను పూర్తిగా నిలిపివేయాలని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ షరతులు నెరవేరిన తర్వాతే ఈ వ్యూహాత్మక జలమార్గంలో మునుపటి పరిస్థితులు నెలకుంటాయని ఇరాన్ చర్చల బృందానికి సమీప వర్గాలు వెల్లడించాయి.

అమెరికాతో తాము ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరపడం లేదని, కేవలం ఒమాన్ మధ్యవర్తిత్వంతోనే చర్చలు సాగుతున్నాయని ఇరాన్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

అమెరికా సెంట్రల్ కమాండ్ (CENTCOM) స్పందన:

దక్షిణ మార్గం అందుబాటులో ఉంది: ఇరాన్ దూకుడుగా వ్యవహరిస్తున్నప్పటికీ, హర్మూజ్ జలసంధి దక్షిణ మార్గం వాణిజ్య నౌకల ప్రయాణానికి పూర్తిగా తెరచి ఉంచినట్లు యూఎస్ సెంటకమ్ తెలిపింది.

నౌకలకు భద్రత: గత మూడు నెలలుగా సుమారు 1,000కు పైగా అంతర్జాతీయ వాణిజ్య నౌకలు సురక్షితంగా జలసంధిని దాటేందుకు తమ దళాలు సహాయపడ్డాయని ప్రకటన విడుదల చేసింది.

అనుమతులు, రుసుములు అవసరం లేదు: అంతర్జాతీయ జలమార్గాలపై ఏ ఒక్క దేశానికీ పూర్తి నియంత్రణ ఉండదని, ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు ఇరాన్ లేదా ఇతర దేశాల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు లేదా ప్రత్యేక రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదని యూఎస్ తెలిపింది.



ఆయుధ నిల్వలపై రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ ఖండన:

ఇరాన్ ఘర్షణల వల్ల తమ వద్ద ఉన్న కీలక క్షిపణి నిరోధక వ్యవస్థలు (THAAD ఇంటర్‌సెప్టర్లు, పేట్రియాట్ నిల్వలు) ప్రమాదకర స్థాయికి తగ్గిపోయాయంటూ వెలువడిన నివేదికలను అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ తీవ్రంగా ఖండించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు.

అటు డొనాల్డ్ ట్రంప్ అణు చర్చల దిశగా ఒత్తిడి తెస్తున్నప్పటికీ, తాము అమెరికాతో ద్వైపాక్షిక చర్చలు జరపడం లేదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయియా స్పష్టం చేయడంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

# నవవధువు అనుమానాస్పద మృతి

**భర్త విషం సేవించి ఆస్పత్రిలో చికిత్స..**
**మెజిస్ట్రేట్ విచారణకు ఆదేశాలు**

**బలగం టీవీ, లక్నో**



ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లాలో కట్న వేధింపుల ఆరోపణల మధ్య నవవధువు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. భర్త విషం సేవించి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ఇంట్లో ఉన్న భార్య ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. అయితే అదనపు కట్నం కోసం అత్తింటి కుటుంబ సభ్యులే ఆమెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం.. బాబినా ప్రాంతానికి చెందిన సాగర్ సాహు, రాధ పరిచయం ఉన్నవారే కాగా, ఇరు కుటుంబాల అంగీకారంతో 2025 నవంబర్ 25న ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని అశోక్‌నగర్ నుంచి స్వగ్రామానికి తిరిగి వచ్చిన దంపతుల మధ్య ఆగస్టు 3 రాత్రి తీవ్ర వాగ్వాదం జరిగింది. అనంతరం సాగర్ విషపదార్థం సేవించడంతో కుటుంబ సభ్యులు తొలుత స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఝాన్సీలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడు ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.

ఇదిలా ఉండగా, అదే రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న రాధ సీలింగ్‌కు ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వివాహం జరిగి ఏడేళ్లు పూర్తి కాకపోవడంతో కేసుపై మెజిస్ట్రేట్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు.

మృతురాలి కుటుంబ సభ్యులు మాత్రం అదనపు కట్నంగా రూ.10 లక్షలు డిమాండ్ చేస్తూ అత్తింటి వారు వేధించారని, అదే కారణంగా ఆమెను హత్య చేసి ఆత్మహత్యగా చూపించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, మెజిస్ట్రేట్ విచారణ నివేదిక ఆధారంగా ఘటనకు గల అసలు కారణాలు నిర్ధారించి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# చంద్రుడిపై కూలిన స్పేస్‌ఎక్స్ రాకెట్ శకలం



**గంటకు 5,400 మైళ్ల వేగంతో ఢీకొన్నట్లు అంచనా.. భూమికి ఎలాంటి ముప్పు లేదన్న శాస్త్రవేత్తలు**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

స్పేస్‌ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్‌కు చెందిన శకలం బుధవారం చంద్రుడిపై కుప్పకూలినట్లు అంతరిక్ష శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అధికారిక ధ్రువీకరణ ఇంకా వెలువడనప్పటికీ, ఈ ఘటన ఇప్పటికే జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. గంటకు సుమారు 5,400 మైళ్ల వేగంతో ప్రయాణించిన సుమారు 4 వేల కిలోల బరువున్న రాకెట్ అవశేషం చంద్రుడిని ఢీకొన్నట్లు సమాచారం.

శాస్త్రవేత్తల వివరాల ప్రకారం.. 2025 జనవరిలో ప్రయోగించిన ఫాల్కన్-9 రాకెట్‌కు చెందిన పునర్వినియోగ భాగం (రీయూజబుల్ స్టేజ్) ఏడాదికిపైగా అంతరిక్షంలో పరిభ్రమించిన అనంతరం చంద్రుడిపై కూలింది. ఐదు అంతస్తుల భవనం ఎత్తుకు సమానమైన ఈ శకలం చంద్రుడిపై ఉన్న ఐన్‌స్టీన్ క్రేటర్ సమీపంలో పడినట్లు అంచనా వేస్తున్నారు.

ఈ ఢీకొట్టడం వల్ల చంద్రుడి ఉపరితలంపై గణనీయమైన ప్రభావం ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. సుమారు 18 మీటర్ల లోతు, 12 మీటర్ల వెడల్పుతో కొత్త గుంత ఏర్పడే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఢీకొన్న సమయంలో ఎగిసిన ధూళి, ఉపరితల మార్పులను అమెరికా టెలిస్కోప్‌లు, నాసా లూనార్ రీకానిసెన్స్ ఆర్బిటర్, దక్షిణ కొరియాకు చెందిన దనూరి ప్రోబ్ చిత్రీకరించే అవకాశం ఉందని తెలిపారు.

అయితే ఈ ఘటన వల్ల భూమికి ఎలాంటి ప్రమాదం లేదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. అధికారిక పరిశీలనలు పూర్తైన అనంతరం ఢీకొన్న ప్రాంతానికి సంబంధించిన చిత్రాలు, వివరాలు విడుదలయ్యే అవకాశం ఉంది.



# దుబాయ్‌లో వరుస పేలుళ్లు..

**20 నిమిషాల్లో ఏడు ఘటనలు**
**జెబెల్ అలి ఇండస్ట్రియల్ జోన్‌లో భారీ మంటలు.. కారణాలపై అధికారిక స్పష్టత లేదు**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్ నగరం బుధవారం తెల్లవారుజామున వరుస పేలుళ్లతో దద్దరిల్లింది. జెబెల్ అలి ఇండస్ట్రియల్ జోన్ పరిధిలో కేవలం 20 నిమిషాల వ్యవధిలో ఏడు పేలుళ్లు చోటుచేసుకున్నట్లు ఎమిరాటి అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ ఘటనలకు కారణమేంటి, దాడులకు ఎవరు పాల్పడ్డారనే విషయంపై అధికారులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

పేలుళ్ల అనంతరం జెబెల్ అలి పోర్టు సమీపంలోని చమురు నిల్వ, రవాణా కేంద్రం వద్ద భారీ మంటలు, దట్టమైన పొగలు అలుముకున్నాయి. స్థానికులు ఈ ఘటన దృశ్యాలను చిత్రీకరించే ప్రయత్నం చేయగా భద్రతా సిబ్బంది అడ్డుకున్నట్లు సమాచారం. ఘటనతో పరిసర ప్రాంతాల్లో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

కొన్ని అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, యెమెన్ నుంచి జరిగిన క్షిపణి దాడుల కారణంగానే ఈ పేలుళ్లు సంభవించి ఉండవచ్చని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సమాచారాన్ని యూఏఈ ప్రభుత్వం ఇప్పటివరకు ధ్రువీకరించలేదు.ఇదే సమయంలో యెమెన్ రాజధాని సనాలో కూడా పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. వైమానిక లేదా క్షిపణి దాడుల వల్లే అవి జరిగి ఉండవచ్చని అక్కడి అధికారులు పేర్కొన్నప్పటికీ, నష్టం వివరాలు వెల్లడించలేదు.

మరోవైపు హార్మూజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలను పునరుద్ధరించే అంశంపై ఇరాన్, ఒమన్ మధ్య చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం. అయితే ఈ అంశంపై కూడా సంబంధిత దేశాల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# శరవేగంగా రాజన్న ఆలయ అభివృద్ధి పనులు..



**బలగం టీవీ, వేములవాడ:**

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి, విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన ఆలయాన్ని సందర్శించి అధికారులతో కలిసి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆలయ విస్తరణ, తూర్పు గోపుర నిర్మాణం, అన్విటి మండపం విస్తరణతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మార్గదర్శకత్వం, జిల్లా మంత్రుల సహకారంతో రాజన్న ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే మంజూరైన రూ.150 కోట్లకు అదనంగా ఇటీవల రూ.99.40 కోట్లు విడుదల కావడంతో పనులను మరింత వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు.

ప్రస్తుతం ఆలయ అభివృద్ధి పనుల్లో సుమారు 55 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించినట్లు తెలిపారు. తూర్పు గోపురాన్ని సుమారు 95 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్నామని, ఇందుకు అవసరమైన కృష్ణశిలలను దశలవారీగా సమీకరిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన శిలలను కూడా త్వరితగతిన తరలించి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

అన్విటి మండపం విస్తరణ పనులు ప్రణాళిక ప్రకారం కొనసాగుతున్నాయని, ఆలయానికి వచ్చే భక్తులకు త్వరిత దర్శనం కల్పించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి సమీక్షలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న ఆలయ అభివృద్ధి పురోగతిపై ప్రత్యేకంగా ఆరా తీస్తున్నారని పేర్కొన్నారు.

పర్యాటకాభివృద్ధిలో భాగంగా టూరిజం శాఖ ఆధ్వర్యంలో రూ.12 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన పార్కును ఇటీవల ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే పట్టణ అభివృద్ధిలో భాగంగా రూ.47 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు కొనసాగుతున్నాయని, బద్ది పోచమ్మ ఆలయాన్ని సుమారు రూ.10 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. త్వరలో శృంగేరి పీఠాధిపతి జగద్గురు శ్రీ శ్రీ శ్రీ విధూశేఖర భారతి స్వామి వారిని కలిసి ఇప్పటివరకు పూర్తయిన పనులను వివరించి, మిగిలిన అభివృద్ధి కార్యక్రమాలపై వారి సూచనలు, అనుమతులు తీసుకుంటామని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు ప్రాచీన దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న ఆయన, రాజన్న ఆలయానికి ఇప్పటివరకు మొత్తం రూ.249.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.





## రోగ్యంతో బాధపడుతున్న సతీష్‌కు మాజీ కౌన్సిలర్ దార లావణ్య–అశోక్ ఆర్థిక సాయం...

**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని బి.వై.నగర్ 34వ వార్డుకు చెందిన కుడిక్యాల సతీష్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ దార లావణ్య–అశోక్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా సతీష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, వైద్య చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, అవసరమైన సమయంలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా దార లావణ్య మాట్లాడుతూ, ప్రజలకు కష్టసమయంలో అండగా నిలవాలనే బి.ఆర్.ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) స్ఫూర్తితో ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.

## డ్రోన్‌లతో పౌరులపై దాడులు చేస్తున్న రష్యా

**జెలెన్‌స్కీ ఆరోపణ**

**బలగం టీవీ, కీవ్**



ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ రష్యాపై తీవ్ర ఆరోపణలు చేశారు. డ్రోన్‌లను ఉపయోగించి సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని, దీనిని "డ్రోన్ సఫారీ"గా అభివర్ణించారు. ఈ మేరకు దక్షిణ ఉక్రెయిన్‌లో జరిగినట్లు పేర్కొన్న ఓ ఘటనకు సంబంధించిన వీడియోను తన టెలిగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు.

జెలెన్‌స్కీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఖేర్సన్ ప్రాంతంలో రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న ఓ మొబైల్ వ్యాపారి వద్దకు డ్రోన్ చేరుకుని దాడి చేసింది. బాధితుడు వేడుకున్నప్పటికీ డ్రోన్ అతని చుట్టూ తిరుగుతూ చివరకు పేలిందని, ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. శరీరంలోకి పేలుడు శకలాలు దిగినట్లు పేర్కొన్నారు. ఫ్రంట్‌లైన్ ప్రాంతాల్లో నివసించే పౌరులను భయభ్రాంతులకు గురిచేయడానికి రష్యా రిమోట్ ద్వారా నియంత్రించే డ్రోన్‌లను వినియోగిస్తోందని జెలెన్‌స్కీ ఆరోపించారు. ఈ ఘటనను ప్రపంచ దేశాలు గమనించాలని ఆయన పిలుపునిచ్చారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సిబిహా కూడా స్పందిస్తూ, పౌరులను లక్ష్యంగా చేసుకుని డ్రోన్‌లతో దాడులు చేయడం అంతర్జాతీయ మానవతా చట్టాలకు విరుద్ధమని, ఇది యుద్ధ నేరంగా పరిగణించాల్సిన అంశమని పేర్కొన్నారు.అయితే, జెలెన్‌స్కీ చేసిన ఈ ఆరోపణలు, వీడియోలోని ఘటనపై రష్యా నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు.

# ఎగువ మానేరు ప్రాజెక్ట్ వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, గంభీరావుపేట:**

ఎగువ మానేరు ప్రాజెక్ట్ వద్ద నీటి పారుదల, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.బుధవారం గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఉన్న ఎగువ మానేరు ప్రాజెక్ట్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితె, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద పరిస్థితులు, ప్రస్తుత నీటి నిల్వలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ప్రస్తుతం కూడవెల్లి, పాల్వంచ వాగుల నుంచి ఎలాంటి ఇన్‌ఫ్లో లేదని, ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 2 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.6 టీఎంసీల నీరు నిల్వ ఉందని నీటి పారుదల శాఖ అధికారులు

తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరి ప్రాజెక్ట్ పూర్తిస్థాయికి చేరే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి మట్టాన్ని నిరంతరం పరిశీలిస్తూ, ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాల రైతులు, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు.అలాగే ప్రాజెక్ట్ మత్తడి పారే పరిస్థితి ఏర్పడితే పోలీసులు, రెవెన్యూ అధికారులు వెంటనే బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించాలని అన్నారు .

ఈ పరిశీలనలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, ప్రశాంత్, తహసీల్దార్ మారుతి, నర్మాల సర్పంచ్ అర్చనతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



## సిరిసిల్ల-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణకు కదలిక..

**-కేంద్ర మంత్రిత్వ శాఖకు లేఖ.. రెడ్డబోయిన గోపి చొరవతో ముందడుగు**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లా అభివృద్ధిలో కీలకమైన సిరిసిల్ల-సిద్దిపేట (దుద్దెడ) జాతీయ రహదారి -365బీ నాలుగు లేన్ల విస్తరణ పనుల్లో కదలిక వచ్చింది. ప్రాజెక్టు డీపీఆర్ ఆమోద ప్రక్రియను వేగవంతం చేసేందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి చేసిన ప్రయత్నాలు ఫలిస్తున్నాయి.జిల్లా ప్రజల రవాణా అవసరాలు, పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని రహదారి విస్తరణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ రెడ్డబోయిన గోపి ఇటీవల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి కార్యాలయం ఈ అంశాన్ని కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ దృష్టికి తీసుకెళ్లింది. గోపి విజ్ఞప్తి మేరకు 2026 జూలై 30న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కార్యాలయం నుంచి రోడ్డు రవాణా శాఖకు అధికారిక లేఖ పంపించారు.హోంశాఖ సహాయ మంత్రి ప్రైవేట్ సెక్రటరీ ఆంధ్ర వంశీ, రోడ్డు రవాణా శాఖ మంత్రి ప్రైవేట్ సెక్రటరీ దీపక్ షిండే లకు పంపిన ఈ లేఖలో నిబంధనల ప్రకారం డీపీఆర్ ఆమోదానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.కేంద్ర స్థాయిలో చొరవ తీసుకుని రహదారి విస్తరణ అంశాన్ని ముందుకు తీసుకెళ్లిన రెడ్డబోయిన గోపి కృషిపై పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే సిరిసిల్ల-సిద్దిపేట మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడి, పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

**ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్**

బలగం టీవీ, వేములవాడ:

ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల సందర్భంగా వేములవాడ పట్టణంలో నిర్వహించిన బోనాల మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం ఎంప్లాయిస్ యూనియన్, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విప్ ఆది శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అది శ్రీనివాస్ మాట్లాడుతూ.. అమ్మవారి కటాక్షంతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని అమ్మవారిని కోరుకున్నట్లు పేర్కొన్నారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించే బోనాల ఉత్సవాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, వివిధ సంఘాల ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పాలమూరు వీసీకి గవర్నర్ సంయుక్త కార్యదర్శి ఘన సన్మానం

**లోక్‌భవన్‌లో ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్‌కు మెమెంటో అందజేత**

బలగం టీవీ, గంభీరావుపేట:

పాలమూరు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్‌ను తెలంగాణ గవర్నర్ సంయుక్త కార్యదర్శి కె. శశికిరణాచారి సన్మానించారు. హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో గవర్నర్‌తో జరిగిన సమావేశానికి హాజరైన సందర్భంగా ప్రొఫెసర్ శ్రీనివాస్‌ను తన చాంబర్‌లో సత్కరించి మెమెంటో అందజేశారు.విశ్వవిద్యాలయ అభివృద్ధికి, ఉన్నత విద్యా రంగానికి ప్రొఫెసర్ శ్రీనివాస్ అందిస్తున్న సేవలను శశికిరణాచారి అభినందించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కె. శశికిరణాచారి, ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్ ఇద్దరూ రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహిస్తుండటం విశేషం. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం పాల్గొన్నారు.




## రహదారి భద్రత పాటించడం ప్రతి ఒక్కరీ బాధ్యత..

**మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధం..**

**- డీటీఓ శ్రీనివాస్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని డీటీఓ దేవునూరి శ్రీనివాస్ సూచించారు. రహదారి భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు రవాణా శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీటీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వాహనం నడిపే సమయంలో హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం తప్పనిసరి అని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు.

రహదారి దాటే సమయంలో జీబ్రా క్రాసింగ్‌ను ఉపయోగించాలని, ట్రాఫిక్ సిగ్నల్లను గౌరవించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించడం, అతివేగం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు.విద్యార్థులు స్వయంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు తమ కుటుంబ సభ్యులకు కూడా రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రవాణా శాఖ సిబ్బంది, సహాయక మోటారు వాహనాల తనిఖీ అధికారి పృథ్వీరాజ్ వర్మ, ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రూపు నారాయణపేటలో అందుబాటులో పాముకాటు మందు

బలగం టీవీ, ఓదెల

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం రూపు నారాయణపేట గ్రామంలో పాముకాటు బాధితులకు అత్యవసరంగా ఉపయోగపడే యాంటీ స్నేక్ వెనం (పాముకాటు) మందును అందుబాటులో ఉంచినట్లు గ్రామ సర్పంచ్ బొంగాని రమ తెలిపారు.గ్రామీణ ప్రాంతంలో ప్రజలు వ్యవసాయ పనులు, ఇళ్ల పరిసరాల్లో పాముకాటుకు గురయ్యే ఘటనలు తరచుగా జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన ఓ కళాశాల విద్యార్థిని పాముకాటుతో మృతి చెందిన ఘటనను దృష్టిలో ఉంచుకుని గ్రామస్తుల ప్రాణరక్షణ కోసం ఈ చర్య చేపట్టామని వివరించారు.

ఈ సందర్భంగా బుధవారం యాంటీ స్నేక్ వెనం మందులను స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు రమేష్‌కు అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో గ్రామస్తులకు వెంటనే ప్రాథమిక వైద్య సహాయం అందించేందుకు ఈ మందులు ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జీలుక స్వప్న, పంచాయతీ కార్యదర్శి రాజకుమార్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డయల్ 112పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి..

**-ఎస్పీ మహేష్ బి. గితే**

బలగం టీవీ, గంభీరావుపేట :



అత్యవసర సమయాల్లో ప్రజలకు మరింత వేగంగా సేవలు అందించేందుకు డయల్ 100 స్థానంలో ప్రారంభమైన డయల్ 112 అత్యవసర సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ మహేష్ బి. గితే అధికారులను ఆదేశించారు. బుధవారం పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల నియంత్రణ, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించే క్రమంలో ఎస్పీ మహేష్ బి. గితే గంభీరవుపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ దర్యాప్తుల పురోగతి, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ వ్యవస్థ, రౌడీషీటర్లు, నేరస్తులపై కొనసాగుతున్న నిఘా తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 112ను వినియోగించేలా చైతన్యం కల్పించాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేందుకు విజిబుల్ పోలీసింగ్ మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ప్రతి పోలీస్ సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని అన్నారు.రాత్రి సమయాల్లో గ్రామాల్లో పెట్రోలింగ్‌ను పెంచాలని, రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. గంజాయి, డ్రగ్స్, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ తనిఖీల్లో సీఐ వెంకటేష్, ఎస్ఐ శ్రీకాంత్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బిడ్డ పుట్టిన గంటలోపు మురిపాలు ఇవ్వాలి



**-ఆరు నెలలు తప్పనిసరిగా తల్లిపాలే అందించాలి :**
**ఐసీడీఎస్ ఎక్స్‌టెన్షన్ అధికారి వనిత**

బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట:

తల్లి పాలలోనే బిడ్డకు అవసరమైన అన్ని రకాల పోషకాలు లభిస్తాయని, బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు మురిపాలు ఇవ్వాలని, మొదటి ఆరు నెలలు తప్పనిసరిగా తల్లిపాలే అందించాలని ఐసీడీఎస్ ఎక్స్‌టెన్షన్ అధికారి వనిత బాలింతలకు సూచించారు.ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి సెక్టర్ పరిధిలోని అల్మాస్‌పూర్ గ్రామంలో బుధవారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు.తల్లి పాల ప్రాముఖ్యత, బిడ్డకు పాలు ఇచ్చే సరైన విధానం, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం, తల్లిపాలపై ఉన్న అపోహలపై ఆమె అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి వద్దకు చేర్చి పాలు అందించేలా చూడాలని సూచించారు.తల్లిపాలు ఇవ్వడం వల్ల బాలింత ఆరోగ్యంతో పాటు బిడ్డ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. మొదటి గంటలో ఇచ్చే మురిపాలలో శిశువుకు రోగ నిరోధక శక్తిని పెంచే గుణాలు ఉంటాయని వివరించారు. ఆరు నెలల పాటు తల్లిపాలే ఇవ్వడం వల్ల బిడ్డ ఎదుగుదల, బరువు పెరుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.బాలింతలు వైద్యుల సూచన మేరకు పోషకాహారం తీసుకోవాలని, తగిన ఆహారం తీసుకుంటే పాలు సమృద్ధిగా ఉత్పత్తి అవుతాయని వనిత సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వాణి, కిరణ్మయి, రేణుక, ఏఎన్ఎంలు సుమలత, రుత్తమ్మ, ఆశా కార్యకర్త మనీషా, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# '30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలి..

**-చీర్లవంచలో హైపర్‌టెన్షన్‌పై అవగాహన కార్యక్రమం**

బలగం టీవీ,వేములవాడ:

అధిక రక్తపోటు నిశ్శబ్దంగా శరీరాన్ని దెబ్బతీసే వ్యాధి అని, 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలని జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్ సూచించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలో డిప్లొమా ఇన్ హెల్త్ ప్రమోషన్ అండ్ ఎడ్యుకేషన్ శిక్షణార్థి సరోజన ఆధ్వర్యంలో హైపర్‌టెన్షన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి కిరణ్మయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కొప్పు ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కొప్పు ప్రసాద్ మాట్లాడుతూ.. సమతుల్య ఆహారం తీసుకోవడం, ఉప్పు వినియోగాన్ని తగ్గించడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం ద్వారా రక్తపోటును నియంత్రించవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు.

గ్రామ సర్పంచ్ కిరణ్మయి మాట్లాడుతూ.. రక్తపోటు నియంత్రణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.శిక్షణార్థి సరోజన గ్రామ ప్రజలకు హైపర్‌టెన్షన్ లక్షణాలు, కారణాలు, నివారణ చర్యలు, చికిత్స విధానాలు, జీవనశైలిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ శేఖర్, గ్రామ కార్యదర్శి నీరజ, సూపర్‌వైజర్ కవిత, డీడీఎం కార్తీక్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో సైబర్ అవగాహన ర్యాలీ...







బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

విద్యార్థి దశ నుంచే సైబర్ మోసాలపై అవగాహన పెంపొందించి, సైబర్ సురక్షిత తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పిలుపునిచ్చారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఆగస్టు-2026 స్వాతంత్య్ర మాసోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సురక్ష కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి బతుకమ్మ ఘాట్ వరకు విద్యార్థులతో కలిసి భారీ సైబర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సైబర్ మోసాల పట్ల ప్రజలు, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, విద్యాసంస్థల్లో సైబర్ భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని, సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల ద్వారా వచ్చే పెట్టుబడి ఆఫర్లు, ఉద్యోగ అవకాశాల పేరుతో పంపే సందేశాలు, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్ట్, లోన్ యాప్‌ల పేరుతో జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలు వచ్చిన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే, ముఖ్యంగా 'గోల్డెన్ అవర్' (మొదటి గంట)లో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసి తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఎస్పీ తెలిపారు. విద్యార్థులు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, అపరిచితుల నుంచి వచ్చే సందేశాలు, లింకులు, ఫ్రెండ్ రిక్వెస్ట్‌లకు స్పందించవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దని సూచించారు. "అగు... ఆలోచించు... నిజం నిర్ధారించు... సైబర్ భద్రత పెంచు" అనే నినాదంతో నిర్వహించిన ఈ ర్యాలీలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు గణేష్, నాగరాజు, జునైద్, సైబర్ విభాగం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల జిల్లా టీఐసీసీఐ కో-ఆర్డినేటర్‌గా గోపి నాయక్ బానోత్

బలగం టీవీ, సిరిసిల్ల:

గిరిజన పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, యువతకు వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్న ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ తెలంగాణ చాప్టర్, శ్రీ గోపి నాయక్ బానోత్ గారిని సిరిసిల్ల జిల్లా కో-ఆర్డినేటర్‌గా నియమించింది. ఈ నియామకం ద్వారా జిల్లాలోని గిరిజన యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, MSME వ్యాపారవేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, మార్కెట్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, వెండర్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, ఇతర వ్యాపార ప్రోత్సాహక అవకాశాలపై అవగాహన కల్పించి, వారికి అవసరమైన సహకారం అందించనున్నారు.



అలాగే సిరిసిల్ల జిల్లాలో కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించడం, స్థానిక యువతను స్వయం ఉపాధి, పారిశ్రామిక రంగాల వైపు ప్రోత్సహించడం, గిరిజన పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకురావడం వంటి కార్యక్రమాలకు ప్రత్యేకంగా కృషి చేయనున్నట్లు TICCI తెలంగాణ చాప్టర్ పేర్కొంది. ఈ సందర్భంగా TICCI తెలంగాణ చాప్టర్ అధ్యక్షులు డా. శ్రీనివాస్ ధారావత్ మ[illegible] స్థాయిలో సమర్థవంతమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయడం ద్వారా గిరిజన పారిశ్రామికవేత్తలకు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడమే TICCI ప్రధాన లక్ష్యమని తెలిపారు. గోపి నాయక్ బానోత్ నియామకానికి TICCI తెలంగాణ చాప్టర్ తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు [illegible]యజేస్తూ, ఆయన నాయకత్వంలో సిరిసిల్ల జిల్లాలో TICCI కార్యకలాపాలు మరింత విస్తరించి, గిరిజన పారిశ్రామికవేత్తలకు విశేష ప్రయోజనం చేకూరాలని ఆకాంక్షించింది.

# 2030 కామన్వెల్త్ క్రీడలకు శ్రీకారం..

**గుజరాత్ సీఎంకు కామన్వెల్త్ పతాకం అందజేత**

**బలగం టీవీ, హైదరాబాద్**

2030 కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వనున్న అహ్మదాబాద్ సన్నాహాలకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. గ్లాస్గోలో జరిగిన 2026 కామన్వెల్త్ క్రీడల ముగింపు వేడుకల్లో భారత్‌కు అందజేసిన కామన్వెల్త్ క్రీడల పతాకాన్ని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి బుధవారం గాంధీనగర్‌లో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అధికారికంగా అందజేశారు.

గ్లాస్గోలో జరిగిన ముగింపు వేడుకల్లో ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషాతో కలిసి హర్ష్ సంఘవి పాల్గొన్నారు. ఆ సందర్భంగా కామన్వెల్త్ క్రీడల పతాకాన్ని అధికారికంగా భారత్‌కు అప్పగించారు.

ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, 2030 కామన్వెల్త్ క్రీడలు పూర్తయ్యే వరకు ఈ పతాకం గుజరాత్‌లోనే ఉంటుంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదించిన 'ఫిట్ ఇండియా' ఉద్యమానికి ఇది ప్రేరణగా నిలవడంతో పాటు, 2030 క్రీడల




హణకు సన్నాహాల ప్రారంభానికి ప్రతీకగా ఉండనుంది.

ఈ కార్యక్రమానికి గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో గుజరాత్‌కు ప్రాతినిధ్యం వహించిన పారా అథ్లెట్లు రాకేశ్ భట్, రోహిత్ మజ్‌గుల్, పారా టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి సోనల్ పటేల్ హాజరయ్యారు.

అహ్మదాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం

హూతో మాట్లాడిన హర్ష్ సంఘవి.. 2030 కామన్వెల్త్ క్రీడలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన చేయడానికి అవసరమైన అన్ని వసతులను కల్పిస్తూ, నిర్వహణలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతామని చెప్పారు.

దేశ యువతకు క్రీడల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు 'ఫిట్ ఇండియా' ఉద్యమంతో పాటు మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో దేశవ్యాప్తంగా క్రీడా మౌలిక సదుపాయాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, ముఖ్యంగా ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ నేతృత్వంలో అహ్మదాబాద్‌లో ఆధునిక క్రీడా వసతులు విస్తృతంగా అభివృద్ధి చెందాయని హర్ష్ సంఘవి తెలిపారు.

# బాధితులకు అండగా మెస్సీ

**మాడ్రిడ్ కార్చిచ్చు పునర్నిర్మాణానికి భారీ విరాళం**

**బలగం టీవీ, హైదరాబాద్**

అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ తన ఉదారతతో మరోసారి అభిమానుల హృదయాలను గెలుచుకున్నాడు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో ఇటీవల సంభవించిన భారీ కార్చిచ్చు కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల పునర్నిర్మాణానికి మెస్సీ 80 వేల యూరోలు (భారత కరెన్సీలో సుమారు రూ. 87 లక్షలు) విరాళంగా ప్రకటించాడు.

ఈ విషయాన్ని మాడ్రిడ్ కమ్యూనిటీ అధ్యక్షురాలు ఇసాబెల్ డియాజ్ అయూసో సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తూ మెస్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

మాడ్రిడ్ అధ్యక్షురాలి ప్రశంసలు

"మాడ్రిడ్‌లోని 'సియెర్రా ఓస్టా' ప్రాంత పునర్నిర్మాణం కోసం మెస్సీ 80 వేల యూరోలు అందించారు. ఈ విపత్కర సమయంలో స్పందించిన ఆయనకు ధన్యవాదాలు. త్వరలోనే మాడ్రిడ్‌కు రానున్న మెస్సీకి ఘనంగా స్వాగతం పలికి, గౌరవంగా సత్కరించేందుకు ఇక్కడి ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు" అని ఇసాబెల్ డియాజ్ పేర్కొన్నారు.



# అగ్నిప్రమాదంలో బూడిదైన ఛాంపియన్ ఇల్లు

**బలగం టీవీ, హైదరాబాద్**

కామన్వెల్త్ గేమ్స్‌లో చరిత్ర సృష్టించిన దక్షిణాఫ్రికా స్టార్ ఈతగాడు చాడ్ లే క్లోస్‌కు ఊహించని విషాదం ఎదురైంది. గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో పతకం గెలిచి అత్యధిక పతకాలు సాధించిన అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పిన మరుసటి రోజే ఆయన నివాసం అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది.

చాడ్ లే క్లోస్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించాడు. జూలై 30న తాను గ్లాస్గోలో కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొంటున్న సమయంలో కేప్‌టౌన్‌లోని తన అపార్ట్‌మెంట్ సముదాయంలో మంటలు చెలరేగాయని, అవి వేగంగా వ్యాపించి తన ఇంటిని పూర్తిగా దహనం చేశాయని తెలిపాడు.

"పదేళ్లకు పైగా నివసించిన నా ఇల్లు పూర్తిగా కాలిపోయింది. కాపాడుకునేందుకు ఏ వస్తువూ మిగల్లేదు" అని లే క్లోస్ ఆవేదన వ్యక్తం చేశాడు.

ఈ అగ్నిప్రమాదంలో తనకు ఎన్నో ఏళ్లుగా పొరుగువారిగా ఉన్న ఓ వృద్ధుడు మృతి చెందడం



తీవ్ర విషాదకరమని పేర్కొంటూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే అగ్నిప్రమాద బాధితుల ఇళ్ల పునర్నిర్మాణానికి తన ఫౌండేషన్ ద్వారా నిధులు సేకరిస్తానని ప్రకటించాడు.

గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల 4×100 మీటర్ల మెడ్లీ రిలేలో కాంస్య పతకం సాధించిన లే క్లోస్.. మొత్తం 21 కామన్వెల్త్ పతకాలతో ఆ క్రీడల చరిత్రలో అత్యధిక పతకాలు సాధించిన అథ్లెట్‌గా నిలిచాడు.

34 ఏళ్ల చాడ్ లే క్లోస్ 2012 లండన్ ఒలింపిక్స్‌లో 200 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. ఇప్పటివరకు నాలుగు ఒలింపిక్ పతకాలు, 16 ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిళ్లు తన ఖాతాలో వేసుకున్నాడు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో కూడా పాల్గొనాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇప్పటికే ప్రకటించాడు.

# ది హండ్రెడ్ లీగ్‌లో హ్యారీ బ్రూక్ విధ్వంసం

**15 బంతుల్లోనే ఫాస్టెస్ట్ ఫిఫ్టీతో రికార్డు**

**బలగం టీవీ, లండన్**

ఇంగ్లండ్ టీ20 కెప్టెన్ హ్యారీ బ్రూక్ ఊచకోత కోశాడు. 'ది హండ్రెడ్ లీగ్'లో భాగంగా లండన్ స్పిరిట్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ లీడ్స్ తరఫున బరిలోకి దిగిన బ్రూక్.. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 15 బంతుల్లోనే 4 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో మెరుపు హాఫ్ సెంచరీ సాధించి టోర్నీ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన అర్ధశతక రికార్డును సమం చేశాడు.

మొత్తంగా 18 బంతుల్లో 55 పరుగులు చేసి బ్రూక్ పెవిలియన్ చేరాడు. గతంలో 2022లో ఆడమ్ రోసింగ్టన్ (లండన్ స్పిరిట్) కూడా 15 బంతుల్లోనే ఈ ఫీట్ సాధించగా, తాజాగా బ్రూక్ ఆ రికార్డును అందుకున్నాడు.

హిట్టర్ల విలయతాండవం.. రికార్డు స్కోరు

ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు:

మిచెల్ మార్ష్: 37 బంతుల్లో 76 పరుగులు (6 ఫోర్లు, 7 సిక్సర్లు)




ర్యాన్ రికెల్టన్: 42 బంతుల్లో 94 నాటౌట్ (6 ఫోర్లు, 8 సిక్సర్లు)

హ్యారీ బ్రూక్: 18 బంతుల్లో 55 పరుగులు (4 ఫోర్లు, 5 సిక్సర్లు)

ఈ ముగ్గురి సిక్సర్ల వర్షంతో సన్‌రైజర్స్ లీడ్స్ నిర్ణీత 100 బంతుల్లో 2 వికెట్ల నష్టానికి 241 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. 'ది హండ్రెడ్ లీగ్' చరిత్రలోనే ఇదే అత్యధిక జట్టు స్కోరు కావడం విశేషం.

లండన్ స్పిరిట్ పోరాటం వృథా

242 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన లండన్ స్పిరిట్ జట్టు 100 బంతుల్లో 6 వికెట్లకు 204 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. డేవిడ్ విల్లే (46 బంతుల్లో 83 నాటౌట్) ఒంటరి పోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. ఈ అద్భుత విజయంతో సన్‌రైజర్స్ లీడ్స్ టోర్నీలో మూడో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది.



## దురాండ్ కప్‌లో ఇండియన్ నేవీకి తొలి విజయం..

**నెరోకాపై 2-0తో గెలుపు**

**బలగం టీవీ, హైదరాబాద్**

దురాండ్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఇండియన్ నేవీ తొలి విజయాన్ని నమోదు చేసింది. బుధవారం ఇంఫాల్‌లో జరిగిన గ్రూప్-డి మ్యాచ్‌లో నార్త్ ఈస్టర్న్ రీ-ఆర్గనైజింగ్ కల్చరల్ అసోసియేషన్ ఫుట్‌బాల్ క్లబ్ (నెరోకా ఎఫ్‌సీ)పై 2-0 తేడాతో విజయం సాధించింది.

మ్యాచ్ ప్రారంభం నుంచే ఇరు జట్లు దూకుడుగా ఆడినా.. తొలి అర్ధభాగంలో 23వ నిమిషంలో రోషన్ పన్నా గోల్ చేసి ఇండియన్ నేవీకి ఆధిక్యం అందించాడు. విజయ్ మరాండి ఇచ్చిన అద్భుతమైన చిప్ పాస్‌ను అందుకున్న రోషన్.. గోల్‌కీపర్ పెనాండ్ సింగ్‌ను దాటించి ఖాళీ గోల్‌లో బంతిని పంపించాడు.

ఆ తర్వాత ఇండియన్ నేవీ బంతిపై ఆధిపత్యం కొనసాగిస్తూ నెరోకాకు పెద్దగా అవకాశాలు ఇవ్వలేదు. రెండో అర్ధభాగంలో కూడా అదే జోరు కొనసాగించిన నేవీ జట్టు 65వ నిమిషంలో మహమ్మద్ ఇనాయత్ అద్భుత వ్యక్తిగత ప్రతిభతో రెండో గోల్ నమోదు చేశాడు. ఇద్దరు డిఫెండర్లను దాటుకుంటూ బైలైన్ వరకు వెళ్లిన ఇనాయత్ కొట్టిన క్రాస్ గోల్‌కీపర్‌ను దాటి నేరుగా నెట్‌లో చేరడంతో స్కోరు 2-0గా మారింది.

చివరి నిమిషాల్లో నెరోకా గోల్ చేసే ప్రయత్నాలు చేసినా ఇండియన్ నేవీ రక్షణ పటిష్టంగా నిలిచింది. 82వ నిమిషంలో శ్రీదార్థ్ నోంగ్‌మైకాపామ్‌కు లభించిన సువర్ణావకాశం కూడా వృథా కావడంతో నెరోకా ఖాతా తెరవలేకపోయింది.

ఈ విజయంతో ఇండియన్ నేవీ రెండు మ్యాచ్‌లలో మూడు పాయింట్లు సాధించి గ్రూప్-డిలో రెండో స్థానానికి చేరుకుంది. మరోవైపు రెండు మ్యాచ్‌ల్లో ఒకే పాయింట్‌తో నెరోకా ఎఫ్‌సీ పట్టికలో చివరి స్థానంలో కొనసాగుతోంది.

## 100మీ, 400మీ ప్రపంచ రికార్డులే లక్ష్యం

**పారా అథ్లెట్ దిలీప్ గావిట్**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకం సాధించి సత్తా చాటిన భారత పారా అథ్లెట్ దిలీప్ గావిట్ ఇప్పుడు మరింత పెద్ద లక్ష్యంపై దృష్టి సారించాడు. వచ్చే నెల జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల్లో 100 మీటర్లు, 400 మీటర్ల విభాగాల్లో ప్రపంచ రికార్డులు నెలకొల్పడమే తన లక్ష్యమని వెల్లడించాడు.



కామన్వెల్త్ గేమ్స్‌లో పారా అథ్లెట్లను సత్కరించిన కార్యక్రమం సందర్భంగా దిలీప్ గావిట్ మాట్లాడుతూ.. గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో తొలిసారి 100 మీటర్ల విభాగంలో పాల్గొని గేమ్స్ రికార్డుతో స్వర్ణ పతకం గెలుచుకోవడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. 2022 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో 400 మీటర్లలో స్వర్ణం సాధించిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఈసారి 100 మీటర్లలో 10.28 సెకన్ల టైమింగ్ నమోదు చేయాలనే లక్ష్యంతో కఠిన సాధన చేస్తున్నట్లు చెప్పారు.

టీ47 విభాగంలో పోటీ పడుతున్న దిలీప్ గావిట్ గతంలో సాధారణ అథ్లెట్లతో కలిసి పోటీ పడి జాతీయ స్థాయిలో, ఖేలో ఇండియా గేమ్స్‌లో స్వర్ణ పతకాలు సాధించినట్లు తెలిపారు. అప్పట్లో ప్రధానంగా 400 మీటర్ల విభాగంలోనే పోటీ పడేవాడినని పేర్కొన్నారు.

ఆసియా క్రీడల్లో పోటీ తీవ్రంగా ఉంటుందని అంగీకరించిన ఆయన, 100 మీటర్లు, 400 మీటర్ల రెండింటిలోనూ బరిలోకి దిగనున్నట్లు చెప్పారు. రెండు విభాగాల్లో పోటీ పడటం తనకు ఒత్తిడిగా అనిపించదని, ముఖ్యంగా 100 మీటర్ల రేసును ఎంతో ఆస్వాదిస్తానని అన్నారు.

తన కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతకాన్ని వ్యక్తిగత కోచ్ వైజనాథ్ కాలేకు అంకితం చేస్తున్నట్లు దిలీప్ గావిట్ తెలిపారు. తాను స్వర్ణం గెలిచిన రోజు గురుపౌర్ణమి కావడం ప్రత్యేకత అని, "ఏ పరిస్థితుల్లోనైనా భారతదేశానికి గర్వకారణంగా నిలవాలి" అని తన కోచ్ ఎప్పుడూ చెప్పే మాటలే తనకు ప్రేరణగా నిలిచాయని పేర్కొన్నారు.

2016 నుంచి కోచ్ వైజనాథ్ కాలే తనకు శిక్షణ ఇస్తున్నారని, కుటుంబ సభ్యుడిలా చూసుకుంటూ అన్ని విధాలా అండగా నిలిచారని గావిట్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆసియా క్రీడలకు ముందు విశ్రాంతి అవసరం లేదని స్పష్టం చేసిన గావిట్.. ఇక నుంచి పూర్తిస్థాయిలో 400 మీటర్ల శిక్షణపై దృష్టి సారిస్తానన్నారు. 400 మీటర్లకు చేసే సాధన 100 మీటర్లకు కూడా ఉపయోగపడుతుందని, కోచ్ సూచనల మేరకు శిక్షణ కొనసాగిస్తానని చెప్పారు.



## సీనియర్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి

**బలగం టీవీ, హైదరాబాద్**

టెస్ట్ క్రికెట్‌లో భారత జట్టు పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలంటే యువ ఆటగాళ్లతో పాటు సీనియర్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం అత్యంత అవసరమని టీమిండియా మాజీ వైస్ కెప్టెన్ అజింక్యా రహానే అభిప్రాయపడ్డారు. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రహానే, ఓ పాడ్‌కాస్ట్ కార్యక్రమంలో పాల్గొని భారత టెస్టు జట్టు కాంబినేషన్, విరాట్ కోహ్లీతో తనకున్న బంధం గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

సీనియర్లను గౌరవించాలి: రహానే

"గత రెండేళ్లుగా నేను జట్టుకు దూరమై ఇంట్లోనే కూర్చొని మ్యాచ్‌లు చూశాను. స్వదేశంలో కూడా టీమిండియా ఓడిపోవడం నన్ను కలిచివేసింది. టెస్ట్ క్రికెట్‌లో రాణించాలంటే తీవ్రమైన పట్టుదల ఉండాలి. క్లిష్టమైన సెషన్లలో పట్టుదలగా నిలబడి ఆడాలి. కానీ ప్రస్తుతం చాలా జట్లలో ఆ లక్షణం కనిపించడం లేదు" అని రహానే పేర్కొన్నారు.

జట్టు కాంబినేషన్ గురించి మాట్లాడుతూ — "టెస్ట్ జట్టులో కనీసం 7 నుంచి 8 మంది సీనియర్ ఆటగాళ్లు, ముగ్గురు లేదా నలుగురు యువ ఆటగాళ్లు ఉండేలా ప్రణాళిక ఉండాలి. కానీ ప్రస్తుతం సీనియర్లందరూ ఒకేసారి తప్పుకోవడంతో జట్టులో కేవలం కొత్తవారే మిగిలారు. సీనియర్ ఆటగాళ్లను గౌరవించడం చాలా అవసరం. టెస్టు క్రికెట్ మనుగడ సాగించాలంటే భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌతాఫ్రికా వంటి ప్రధాన దేశాల్లో ఈ ఫార్మాట్‌ను బలంగా ముందుకు తీసుకెళ్లాలి" అని రహానే స్పష్టం చేశారు.

కోహ్లీ సక్సెస్ సీక్రెట్ ఎప్పటికీ చెప్పలేదు!

పరిమిత ఓవర్ల క్రికెట్ (వైట్ బాల్)లో విరాట్ కోహ్లీ సాధించిన విజయవంతమైన వ్యూహాల గురించి రహానే సరదాగా స్పందించారు. "విరాట్ ఆలోచనా విధానం, మైదానంలో అతని ఎత్తుగడలు చాలా భిన్నంగా ఉంటాయి. అదే అతని సక్సెస్ సీక్రెట్. ఆ రహస్యం ఏంటని నేను పలుమార్లు అడిగినా అతను నాకు చెప్పలేదు. ఎలాంటి ముందస్తు సంకేతం ఇవ్వకుండానే మైదానంలో సరైన సమయంలో రిస్క్ తీసుకునేవాడు. ఎంఎస్ ధోనీ కూడా అలాగే చేసేవాడు, కానీ విరాట్ మైండ్ గేమ్‌లు మరో స్థాయిలో ఉంటాయి."

తన ప్రశాంతత, కోహ్లీ దూకుడు స్వభావం కలగలసి మైదానంలో ఎన్నో విజయవంతమైన భాగస్వామ్యాలకు పునాది వేశాయని రహానే గుర్తు చేసుకున్నారు.

స్లెడ్జింగ్ అంటే కోహ్లీకి ఇష్టం

మైదానంలో విరాట్ కోహ్లీ ప్రవర్తన గురించి చెప్తూ — "కోహ్లీకి స్లెడ్జింగ్ ఎదుర్కోవడం చాలా ఇష్టం. ప్రత్యర్థి ఆటగాళ్లకు అదే రీతిలో బదులివ్వాలా అని నన్ను సలహా అడిగేవాడు. అలా చేస్తేనే అతను మరింత మెరుగ్గా రాణిస్తాడని తెలిసి 'నువ్వు ఖచ్చితంగా స్లెడ్జ్ చేయి' అని చెప్పేవాడిని. మైదానం వెలుపల కూడా మేమిద్దరం ఎంతో సమయం గడిపేవాళ్ళం. బౌలర్లపై ఆధిపత్యం చెలాయించే విషయంలో అతను నన్ను ఎల్లప్పుడూ ప్రోత్సహించేవాడు" అని రహానే చెప్పుకొచ్చారు.

## డ్రింక్స్ మోయించి ఫామ్ దెబ్బతీశారు!

**టీమిండియా మేనేజ్‌మెంట్‌పై కైఫ్ మండిపాటు**

**బలగం టీవీ, హైదరాబాద్**

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పనితీరుపై భారత మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రాన్ని మేనేజ్‌మెంట్ అనవసరంగా కష్టతరం చేసిందని మండిపడ్డారు. ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో ఆరెంజ్ క్యాప్ సాధించిన ఆటగాడికి తుదిజట్టులో అవకాశం ఇవ్వకుండా డ్రింక్స్ మోయించారని తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు.




ఐర్లాండ్‌లోనే అవకాశం ఇచ్చి ఉండాల్సింది

"వైభవ్ సూర్యవంశీ ఒక ప్రత్యేకమైన 'ఎక్స్-ఫ్యాక్టర్' ఉన్న మ్యాచ్ విన్నర్. ఐపీఎల్‌లో తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆరెంజ్ క్యాప్ గెలుచుకుని, మంచి ఫామ్‌లో ఉన్న అతనితో మేనేజ్‌మెంట్ ఐర్లాండ్ పర్యటనలో డ్రింక్స్ మోయించింది. ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లోనే అతనికి తుదిజట్టులో అవకాశం కల్పించి ఉంటే, అతను ఆందోళనను జయించి ఆత్మవిశ్వాసం పొందేవాడు. కానీ ఆ అవకాశం ఇవ్వకపోవడం వల్ల ఇంగ్లండ్ పర్యటనలో ఒత్తిడికి గురయ్యాడు" అని కైఫ్ విశ్లేషించారు.

అరంగేట్రంలో ఇబ్బందులు: ఇంగ్లాండ్ సిరీస్‌లో అరంగేట్రం చేసిన వైభవ్, జోఫ్రా ఆర్చర్ వేసిన షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కొనలేక వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు. దీంతో అతన్ని వెంటనే తుదిజట్టు నుంచి తప్పించడం సరికాదని కైఫ్ అభిప్రాయపడ్డారు.

భారత్‌లో ఆర్చర్‌కు సమాధానం: "వైభవ్ ఇంకా భారత్‌లో ఆర్చర్ బౌలింగ్‌ను ఎదుర్కోలేదు. ఇక్కడ ఆడినప్పుడు ఖచ్చితంగా ఆర్చర్‌కు తన బ్యాట్ రుచి చూపిస్తాడు" అని కైఫ్ ధీమా వ్యక్తం చేశారు. జింబాబ్వే పర్యటనలో సత్తా: ఇంగ్లండ్ పర్యటనలో విఫలమైనప్పటికీ, ఆ తర్వాత జరిగిన జింబాబ్వే పర్యటనలో వైభవ్ అద్భుత బ్యాటింగ్‌తో చెలరేగి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును సొంతం చేసుకుని తన అసలు సత్తా ఏంటో నిరూపించుకున్నాడని గుర్తుచేశారు. యువ ఆటగాళ్ల అరంగేట్రాన్ని సరైన ప్రణాళికతో సులభతరం చేయాలే తప్ప, వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా నిర్ణయాలు ఉండకూడదని కైఫ్ టీమిండియా యాజమాన్యానికి సూచించారు.

## ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ వేదిక బాగుంది

**బిడబ్ల్యూఎఫ్ హర్షం**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాబోయే ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు వేదికవుతున్న ఇక్కడి ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో చేపట్టిన విస్తృత మరమ్మతులు, శుభ్రత పనులపై బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (BWF) సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ ఏడాది జనవరిలో జరిగిన 'ఇండియా ఓపెన్' సందర్భంగా తలెత్తిన అనేక లోపాలను అధికారులు అధిగమించారని పేర్కొంది.

ఆ సమయంలో పరిశుభ్రత లోపించడం, అపరిశుభ్రమైన మరుగుదొడ్లు, స్టేడియం కాంప్లెక్స్ లోపల పావురాలు, కోతులు స్వేచ్ఛగా తిరగడంపై క్రీడాకారులు, అధికారులు తీవ్రస్థాయిలో పెదవి విరిచారు. అయితే, గత ఏడు నెలలుగా తాము పలుమార్లు నిర్వహించిన తనిఖీల్లో గణనీయమైన మార్పులు కనిపించాయని బిడబ్ల్యూఎఫ్ ఈవెంట్స్ డైరెక్టర్ (టూర్నమెంట్ ఆపరేషన్స్) సెల్వఅమరేష్ సుబ్రమణ్యం తెలిపారు.

ముఖ్యమైన మరమ్మతులు & బాగుచేసిన అంశాలు:

మౌలిక వసతులు: స్టేడియంలోని అన్ని మరుగుదొడ్లను ఆధునీకరించడమే కాకుండా, దెబ్బతిన్న సీట్లు, విరిగిపోయిన సీలింగ్‌లను కొత్త వాటితో రీప్లేస్ చేశారు. సీలింగ్ సీలింగ్, వైరింగ్, రూఫ్ వాటర్‌ప్రూఫింగ్ పనులను పూర్తి చేశారు.

పక్షులు, జంతువుల నివారణ: కాంప్లెక్స్ పైకప్పు బీమ్‌లపై పక్షులు వాలకుండా విమానాశ్రయాల్లో ఉపయోగించే తరహా ప్రత్యేక 'యాంటీ-పెస్ట్ జెల్'ను పూశారు. ప్రాంగణంలో తిరుగుతున్న దాదాపు 60కి పైగా వీధికుక్కలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI) అధికారులు తొలగించారు.

లైటింగ్ శ్రేష్ఠత: గతంలో విమర్శలు ఎదుర్కొన్న లైటింగ్ వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగుపరిచేందుకు ఇండోనేషియాకు చెందిన నిపుణుల సేవలను బాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (BAI) వినియోగిస్తోంది.

ఆగస్టు 17న ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీ కోసం స్టేడియంను సంపూర్ణంగా సిద్ధం చేస్తున్నామని, ఎలాంటి అడ్డంకులు లేకుండా పోటీలను నిర్వహించడమే తమ ప్రధాన లక్ష్యమని బిడబ్ల్యూఎఫ్ ప్రతినిధి స్పష్టం చేశారు.

## బాబర్‌కు మళ్లీ నిరాశ.. సెంచరీకి 12 పరుగుల దూరంలో రనౌట్

**బలగం టీవీ, హైదరాబాద్**

పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజామ్ టెస్టుల్లో సెంచరీ కోసం ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. మూడేళ్లుగా శతకం నమోదు చేయలేకపోతున్న బాబర్.. వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో మరోసారి తృటిలో అవకాశాన్ని చేజార్చుకున్నాడు. 147 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్స్‌తో 88 పరుగులు చేసిన అతడు సెంచరీకి కేవలం 12 పరుగుల దూరంలో రనౌట్ కావడంతో నిరాశగా పెవిలియన్ చేరాడు.



పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్ 75వ ఓవర్‌లో జోమెల్ వారిగన్ బౌలింగ్‌లో కవర్స్ వైపు బంతిని ఆడి క్విక్ సింగిల్‌కు బాబర్ ప్రయత్నించాడు. అయితే మరో ఎండ్‌లో ఉన్న అబ్దుల్లా షఫీక్ పరుగుకు నిరాకరించడంతో బాబర్ వెనక్కి తిరిగేలోపే బ్రాండన్ కింగ్ డైరెక్ట్ త్రోతో స్టంప్స్‌ను కూల్చాడు. బాబర్ డైవ్ చేసినా ఫలితం లేకపోయింది.

టెస్టు క్రికెట్‌లో బాబర్ ఆజామ్ రనౌట్ కావడం ఇది ఏడోసారి. దీంతో పాకిస్థాన్ తరఫున టెస్టుల్లో అత్యధికసార్లు రనౌట్ అయిన ఆటగాళ్ల జాబితాలో అజార్ అలీ, వసీం అక్రమ్‌లతో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో ఎనిమిది రనౌట్‌లతో జావేద్ మియాందాద్ అగ్రస్థానంలో ఉన్నాడు.

బాబర్ చివరిసారిగా 2022 డిసెంబర్‌లో న్యూజిలాండ్‌పై కరాచీ టెస్టులో 161 పరుగులతో సెంచరీ నమోదు చేశాడు. ఆ తర్వాత టెస్టుల్లో ఒక్క శతకం కూడా చేయలేకపోతున్నాడు.

ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 344 పరుగులకు ఆలౌటైంది. జస్టిన్ గ్రీవ్స్ (73), రోస్టన్ ఛేజ్ (70) అర్ధసెంచరీలతో రాణించారు. పాకిస్థాన్ బౌలర్లలో సాజిద్ ఖాన్ నాలుగు వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ 387 పరుగులు చేసి 43 పరుగుల ఆధిక్యం సాధించింది. అబ్దుల్లా షఫీక్ 160 పరుగులతో శతకం సాధించగా, బాబర్ 88 పరుగులతో ఆకట్టుకున్నాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసింది.

# సందీప్ కిషన్ సరికొత్త చిత్రం కరికాల

యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పుడు పీరియాడిక్ యాక్షన్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. తాజాగా 'కరికాల' అనే భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో పీరియాడిక్ కథలు, రాజుల చరిత్ర, యుద్ధ నేపథ్యంతో రూపొందుతున్న సినిమాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు సందీప్ కిషన్ కూడా ఓ భారీ పీరియాడిక్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'శంబాల' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపిస్తున్నారు. చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై యుద్ధానికి దూసుకెళ్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో ఆయన పక్కనే ఓ సింహం కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యుద్ధభూమి వాతావరణం, భారీ విజువల్స్, పవర్‌ఫుల్ లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. పోస్టర్‌ను బట్టి చూస్తే, ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా చారిత్రక నేపథ్యంతో కూడిన ఎమోషనల్ సాగా కూడా కావచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా తెరకెక్కించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విడుదల తేదీలను కూడా అధికారికంగా వెల్లడించారు. 'కరికాల చాప్టర్ 1' : 2027 జులై 2, 'కరికాల చాప్టర్ 2' : 2027 అక్టోబర్ 28 అంటే కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రెండు భాగాలను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేయడం విశేషం. ఇప్పటివరకు సందీప్ కిషన్ ఎక్కువగా యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాల్లో కనిపించారు.

అయితే 'కరికాల' తో తొలిసారి భారీ పీరియాడిక్ యాక్షన్ కథలో నటిస్తున్నారు. అయితే సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. ప్రస్తుతం 'సిగ్మా' విడుదల కోసం సందీప్ కిషన్ ఎదురు చూస్తున్నారు. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. జులై 31న 'సిగ్మా' విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల ఇది వాయిదా పడింది.




# CINEMA

## ఆదిపురుష్‌తో రామాయణను పోల్చవద్దు

### రామాయణ విజయం సాధించాలన్న మనోజ్

బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. ఈ సినిమా ట్రైలర్ విడుదలైన నాటి నుంచి వార్తల్లో నిలుస్తోంది. గతంలో వచ్చిన 'ఆదిపురుష్'తో ఈ చిత్రాన్ని పోలుస్తూ కొందరు పోస్ట్‌లు పెడుతున్నారు. తాజాగా ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో 'ఆదిపురుష్' రచయిత మనోజ్ దీనిపై మాట్లాడారు. 'రామాయణ'లో రావణుడి పాత్ర పోషించిన యశ్‌పై ప్రశంసలు కురిపించారు. యశ్ చాలా మంచి నటుడు. అందులో ఎలాంటి సందేహం లేదు. మన భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లే ఏ సినిమాకైనా నా పూర్తి మద్దతు ఉంటుంది. 'రామాయణ' మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఈ చిత్రాన్ని 'ఆదిపురుష్'తో పోల్చొద్దు. అది ప్రేక్షకుల అంచనాలను అందుకోలేపోయింది. ఆ సినిమా కోసం ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడ్డారు. అయితే, 'ఆదిపురుష్' సంగీతం మంచి ఆదరణ సొంతం చేసుకుంది. ఇప్పుడు రామాయణ మ్యూజిక్ కూడా హిట్ కావడం నాకు చాలా ఆనందంగా ఉంది' అని మనోజ్ తెలిపారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా కనిపించనున్న రామాయణ చిత్రం రెండు భాగాలుగా రానుంది. ఇప్పటికే రెండో భాగం కూడా 50 శాతం షూటింగ్ పూర్తయినట్లు రణ్‌బీర్ తెలిపారు. రామాయణ లాంటి గొప్ప కథను 10 భాగాలు తీయొచ్చని రెండు భాగాల్లోనే నితీశ్ తివారీ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారని ప్రశంసించారు. దీపావళికి ఈ సినిమా మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.




# మిస్సింగ్ మేఘన .. ఫస్ట్ లుక్ విడుదల

రామ్ కార్తీక్ హీరోగా, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రం 'మిస్సింగ్ మేఘన'. ఫస్ట్ కాపీ మూవీస్ మరియు కేడి అండ్ కో బ్యానర్లపై పంచుమర్తి నరేష్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహిస్తున్నారు. గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ రివీలింగ్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం టాలీవుడ్ ప్రముఖ టెక్నీషియన్లు, సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ఈ చిత్ర పోస్టర్‌ను తన చేతుల మీదుగా విడుదల చేసి సినిమా యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బెక్కం వేణుగోపాల్‌తో పాటు చిత్ర బృందమంతా ఉత్సాహంగా పాల్గొంది. ఈ సందర్భంగా వి.వి. వినాయక్ మాట్లాడుతూ, బెక్కం వేణుగోపాల్, శ్రీనివాస్ ల సహకారంతో దర్శకుడు వాచస్పతి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారని తెలిపారు. ఈ సినిమాతో హీరో రామ్ కార్తీక్, దర్శకుడు వాచస్పతిలకు మంచి పేరు రావాలని, అలాగే సంగీతంతో పాటు పాటలు కూడా అందించే ఆల్ రౌండర్ ధృవన్‌కు ఈ చిత్రం ద్వారా మంచి గుర్తింపు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ చిత్ర యూనిట్ మొత్తానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, వి.వి. వినాయక్ గారిది గోడలెన్ హ్యాండ్ అని, ఆయన చేతుల మీదుగా తమ సినిమా పోస్టర్ లాంచ్ కావడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మీడియా సహకారంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రం ఒక చక్కటి సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఉంటుందని, ప్రేక్షకులను అలరించే అన్ని కమర్షియల్ హంగులు ఇందులో ఉన్నాయని తెలిపారు. అతి త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. హీరో రామ్ కార్తీక్ మాట్లాడుతూ, తమకు ఈ చిత్రంలో అవకాశం కల్పించిన దర్శకుడు వాచస్పతికి, నిర్మాత నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులందరినీ అలరిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధృవన్ మాట్లాడుతూ, లెజెండ్రీ డైరెక్టర్ వి.వి. వినాయక్ చేతుల మీదుగా పోస్టర్ విడుదల కావడం తన కెరీర్‌లో మరువలేని క్షణమని, ఒక మంచి మ్యూజిషియన్‌కు కావాల్సిన అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయని వెల్లడించారు. ఈ చిత్రానికి శామ్ కె. నాయుడు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా, వనరాజ్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు.




## విడుదలకు సిద్ధం అవుతున్న
# కొరియన్ కనకరాజు

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఇండో-కొరియన్ హారర్ కామెడీ 'కొరియన్ కనకరాజు' విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ప్రముఖ కమెడియన్ సత్య కీలక పాత్ర పోషించారు. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా చూసిన వారి ఒపీనియన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా కామెడీ, వరుణ్ తేజ్ నటన, థమన్ సంగీతం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయని టాక్ వినిపిస్తోంది. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' వంటి విజయవంతమైన కామెడీ చిత్రాలను తెరకెక్కించిన మేర్లపాక గాంధీ, మరోసారి తన మార్క్ కామెడీని ఈ చిత్రంలో చూపించినట్లు సమాచారం. సినిమా తొలి భాగం నుంచి రెండో భాగం వరకు పలు కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని సెన్సార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఇంటర్వెల్ ముందు, తర్వాత వచ్చే ఎపిసోడ్లు బాగా వర్కవుట్ అయ్యాయని అంటున్నారు. అలాగే వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే కామెడీ ట్రాక్‌తో పాటు బుల్లిరాజు పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు కూడా మంచి వినోదాన్ని అందిస్తాయని సమాచారం. సినిమాలో వరుణ్ తేజ్ రెండు విభిన్న కోణాలు ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన సాధారణ యువకుడు కనకరాజు పాత్రలో ఒకవైపు కనిపిస్తే, మరోవైపు కొరియన్ గ్యాంగ్‌స్టర్ ఆత్మ ఆవహించిన తర్వాత పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వంతో కనిపించనున్నారని టాక్. ఈ రెండు పాత్రల మధ్య బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, స్టైల్ పరంగా వరుణ్ తేజ్ మంచి వేరియేషన్ చూపించారని సినిమా చూసిన వారు చెబుతున్నారు. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే వరుణ్ తేజ్ ఈసారి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో కూడా తన నటనతో ఆకట్టుకున్నారని సమాచారం. సినిమా కథ ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో రూపొందినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కియా కంపెనీలో ఉద్యోగం కోసం కొరియా నుంచి వచ్చిన యువతి పాత్రలో రితికా నాయక్ కనిపించనుంది. ఆమెను ప్రేమించే కనకరాజు జీవితంలో అనుకోని మలుపు తిరుగుతుంది. కొరియా నుంచి వచ్చిన ఓ బాటిల్‌లో బంధించబడిన గ్యాంగ్‌స్టర్ ఆత్మ బయటకు వచ్చి కనకరాజును ఆవహిస్తుంది. ఆ తర్వాత కనకరాజు జీవితం ఎలా మారింది? ఆ ఆత్మ కొరియాతో ఉన్న సంబంధం ఏమిటి? చివరకు కథ ఎలాంటి మలుపు తిరిగింది? అనే అంశాల చుట్టూనే సినిమా సాగుతుందని తెలుస్తోంది. సినిమాకు సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు కథకు మరింత బలం చేకూర్చాయని సమాచారం. కామెడీ తర్వాత ఎక్కువ ప్రశంసలు సంగీతానికే వస్తాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.







# సూర్య 47 దీపావళి బరికోసం సిద్ధం

తమిళ స్టార్ హీరో సూర్యకు ఇప్పటికే వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య 47' షూటింగ్‌ను పూర్తి చేశారు. చిత్రబృందం విడుదల చేసిన బీహైండ్ ది సీన్స్ వీడియోతో షూటింగ్ ముగిసిన విషయాన్ని అధికారికంగా వెల్లడించగా, ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీపై ఆసక్తికర చర్చ మొదలైంది. అందుతున్న సమా చారం ప్రకారం, 'సూర్య47'ను ఈ దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే సూర్యకు ఇది వరుసగా మూడో థియేట్రికల్ విడుదలగా నిలవనుంది. ఇప్పటికే 'కరుప్పు'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఆగస్టు 14న వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆ సినిమా విడుదలైన కొద్ది నెలలకే 'సూర్య47' కూడా థియేటర్లలోకి వస్తే, ఒకే ఏడాదిలో వరుసగా మూడు సినిమాలతో అభిమానులను అలరించిన హీరోగా సూర్య నిలుస్తారు. అయితే దీపావళి బరిలో వెట్రిమారన్ దర్శకత్వంలో సిలంబరసన్ టి.ఆర్ నటిస్తున్న 'అరసన్' కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.



# ప్యారడైజ్‌తో పోటీ పడనున్న డోరతి మూవీ




న్యాచురల్ స్టార్ నాని హీరోగా, కయాదు లోహర్ హీరోయిన్‌గా మాస్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటంతో ప్రేక్ష కుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, సరిగ్గా అదే తేదీన నానితో పోటీ పడేందుకు ఆయన 'దసరా' సహనటి కీర్తి సురేష్ సిద్ధమవుతుండటం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్న 'డోరతి' చిత్రంలో కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. సంగీత మాంత్రికుడు ఇళయరాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతానికి ఈ రిలీజ్ డేట్‌ను తమిళ వెర్షన్ కోసం లాక్ చేసినప్పటికీ, తెలుగులోనూ ఇదే తేదీకి వస్తే బాక్సాఫీస్ వద్ద నాని సినిమాతో కీర్తి సురేష్ నేరుగా పోటీ పడాల్సి వస్తుంది. మంచి స్నేహితులుగా ఉన్న నాని, కీర్తి సురేష్‌ల చిత్రాలు ఒకే తేదీన బరిలో నిలుస్తుండటంతో ఈ బాక్సాఫీస్ క్లాష్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చివరికి ఈ సినిమాల విడుదల తేదీల్లో మార్పులు ఉంటాయా లేదా అనేదానిపై త్వరలోనే క్లారిటీ రానుంది.

